epaper.samayamdaily.net

APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

S TV SAMAYAM



epaper.samayamdaily.net APTEL/2006/18267 సమయం మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**



సంపుటి: 19 | సంచిక: 184 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 12 మే 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |


## పారిశ్రామిక ప్రగతిలో సీఐఐ కీలకం

- పశ్చిమాసియా యుద్ధంతో సంక్షోభ పరిస్థితులు
- ప్రధాని మోడీ మిషన్ దేశానికి అవసరం
- అందరం కూడా దానిని అనుసరిస్తే మంచిది
- సీఐఐ సదస్సులో సీఎం చంద్రబాబు

5






## గుప్తనిధుల కోసమే ఆలయం కూల్చివేత

- రేవంత్ డైరెక్షన్‌లోనే కూల్చివేతలు
- కూల్చిన ఆలయం వద్ద పరిశీలించిన హరీష్ రావు

3

## ఆరోగ్య శాఖలో కొలువుల పండగ

- నేడు 1919 మందికి నియామక పత్రాల అందజేత
- ఉస్మానియా మెడికల్ కాలేజీలో భారీ కార్యక్రమం
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి దామోదర రాజనర్సింహ

2





2

## మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి

సభ్యులుగా శ్రీకాంతాచారి తల్లి, చాకలి ఐలమ్మ మనవరాలు





## బండి భగీరథ్ కేసుపై సీఎం సీరియస్

### తక్షణ విచారణకు ఆదేశం

కేసు నమోదులో జాప్యంపై ఆగ్రహం

చట్టం ఎవరికీ చుట్టం కాదన్న ముఖ్యమంత్రి

సిట్ ఏర్పాటు చేస్తూ డీజీపీ ఉత్తర్వులు

మహిళా ఐపీఎస్ పర్యవేక్షణలో దర్యాప్తు

**హైదరాబాద్, మే 11 :** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈ కేసులో తక్షణమే లోతైన విచారణ జరిపించాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు. మే 8వ తేదీనే ఫిర్యాదు అందినప్పటికీ, ఇప్పటివరకు నిందితుడిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని, కనీసం ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం ఎందుకు జరిగిందని ఆయన పోలీసులను ప్రశ్నించారు. ఈ క్రమంలోనే కేసు సమగ్ర విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. బాధితురాలు మైనర్ బాలిక కావడం, కేసు అత్యంత సున్నితమైనది కావడంతో, ఈ దర్యాప్తును ఒక మహిళా ఐపీఎస్ అధికారి పర్యవేక్షణలో

మిగతా 2 లో

## పరారీలో కేంద్ర మంత్రి కొడుకు బండి భగీరథ

- నిందితుడిని పట్టుకుంటాం
- మరోసారి బాధితురాలి స్టేట్‌మెంట్ రికార్డు చేస్తాం
- సిట్ చీఫ్ రితిరాజ్

2



# అందరికీ సమాన విద్యే మా లక్ష్యం

కుల వివక్షకు చరమగీతం..

## కులాల కుంపట్లు వద్దు.. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లే ముద్దు



## రాష్ట్ర ప్రయోజనాల కోసమే కేంద్రంతో సఖ్యత

బీజేపీ అంటే 'బ్రిటిష్ జనతా పార్టీ'

విభజించి పాలించడమే వారి నైజం



- అనుభవరాహిత్యం, అహంకారంతో దేశానికి నష్టం
- చిట్‌చాట్‌లో సీఎం సంచలన వ్యాఖ్యలు

2

- నాణ్యత లేని కిట్లు ఇస్తే 'బొక్కలో' వేయిస్తా!
- టీచర్లూ.. ఒక గంట అదనంగా పనిచేయండి
- 60 రోజుల్లోనే 11 వేల ఉద్యోగాల భర్తీ
- రూ.1,100 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- 100 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం
- ఎల్బీ స్టేడియంలో 'విద్యా వారోత్సవాలు' ప్రారంభం

**హైదరాబాద్, మే 11:** రాష్ట్రంలో కులాల వారీగా విడిపోయిన విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసి, అందరికీ సమానమైన నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా సోమవారం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన 'విద్యా వారోత్సవాల'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ. 1,011 కోట్లతో నిర్మించనున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'కు శంకుస్థాపన చేయడంతో పాటు విద్యాశాఖకు సంబంధించి మొత్తం

మిగతా 2 లో



## రాష్ట్రానికి వచ్చి ప్రధాని సుద్దులు

అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా మాటలెందుకు

ప్రధాని పర్యటనపై మంత్రి పొన్నం వ్యాఖ్యలు

.. వివరాలు 3లో



## కార్మికుల సంక్షేమమే మా ధ్యేయం

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్ కమిటీ కీలక భేటీ

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు

.. వివరాలు 3లో



## భార్య బానిస కాదు!

- జంతువులా చూసే హక్కు లేదు
- ఆత్మగౌరవంతో బతికే హక్కు అందరికీ ఉంది
- సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- గృహ హింస కేసులో నిందితుడి ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరణ

4

## ఇంధన భద్రతపై రాజ్‌నాథ్ కీలక భేటీ

- నిత్యావసరాల కొరత రాకుండా పటిష్ఠ చర్యలు
- ప్రజలు ఆందోళన చెందవద్దు
- చమురు పొదుపు, బంగారం కొనుగోళ్లపై ప్రధాని మోదీ పిలుపును అనుసరించాలని విజ్ఞప్తి

4



## జూలై 1 నుంచి 'వీబీ జీ రామ్ జీ'

4



- 125 రోజులకు పెరగనున్న పనిదినాలు
- 20 ఏళ్ల నాటి చట్టానికి కేంద్రం స్వస్తి





## మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా

# గద్వాల విజయలక్ష్మి

**సభ్యులుగా శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలు**

**హైదరాబాద్, మే 11:** తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు ప్రభుత్వం కొత్త నియామకాలు చేపట్టింది. మహిళా హక్కుల పరిరక్షణ, మహిళా సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం కీలకమైన తెలంగాణ మహిళా కమిషన్‌కు చైర్ పర్సన్‌గా మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని నియమించింది. అలాగే కమిషన్ సభ్యులుగా ప్రభుత్వం పలువురు ప్రముఖ మహిళలకు అవకాశం కల్పించింది. ఈ నియామకాల్లో తెలంగాణ ఉద్యమం, సామాజిక సేవ, మహిళా హక్కుల ఉద్యమాల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమంలో అమరుడైన శ్రీకాంతచారి తల్లి కాసోజు శంకరమ్మను మహిళా కమిషన్ సభ్యురాలిగా రేవంత్‌రెడ్డి సర్కార్ నియమించింది. తెలంగాణ ఉద్యమ సమయంలో శ్రీకాంతచారి త్యాగం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఈ నియామకంతో తెలంగాణ ఉద్యమ కుటుంబాలకు ప్రభుత్వం గౌరవం ఇచ్చినట్లయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మనవరాలు చిట్యాల శ్వేతను కూడా కమిషన్ సభ్యురాలిగా కాంగ్రెస్ సర్కార్ నియమించింది. చాకలి ఐలమ్మ తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో కీలక వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఆమె కుటుంబానికి ఈ నియామకంతో ప్రాధాన్యం సంతరించుకుంది. మహిళా కమిషన్ సభ్యులుగా శశికళ యాదవ్ రెడ్డి, సదాలక్ష్మి, రాధాభాయి, ఉజ్మా షకీరాలను కూడా ప్రభుత్వం నియమించింది. వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా ఈ నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తోందని, మహిళల సమస్యల పరిష్కారంలో కమిషన్ కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు.

## 13న పాలిటెక్నిక్ ప్రవేశ రీక్ష


**హైదరాబాద్, మే 11:** రాష్ట్రంలో ఈనెల 13న నిర్వహించనున్న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకుఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ,ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు వ్యవసాయ, ఉద్యానవన , వెటర్నరీ డిప్లొమా కోర్సుల ప్రవేశానికి ఉదయం 11 గంటల నుంఇ మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 56,494 మంది విద్యార్థులు, 49,945 మంది విద్యార్థినులు పరీక్షలకు దరఖాస్తులు చేసుకున్నారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 293 పరీక్ష కేంద్రాను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు పరీక్ష సమయానికి గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్ కానీ, ఏ ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులను అనుమతించబోమని వివరించారు.

# ఓటర్ల మ్యాపింగ్‌ను వేగవంతం చేయండి

**సీఈఓ సుదర్శన్ రెడ్డి ఆదేశం**

**ఈ నెలఖారుకు 90 శాతం పురోగతి సాధించాలి**

**కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్**



**హైదరాబాద్, మే 11 :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన 'స్పెషల్ ఇన్వెస్టిగేషన్ రివిజన్' (సర్) కార్యక్రమంలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా, వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సీఈఓ కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, నమోదు అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం త్వరలోనే షెడ్యూల్ ప్రకటించనున్న నేపథ్యంలో, ఈ నెలాఖరు నాటికి మ్యాపింగ్ ప్రక్రియలో కనీసం 90 శాతం పురోగతి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మ్యాపింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు వివిధ రెసిడెన్షియల్ అసోసియేషన్లు, గేటెడ్ కమ్యూనిటీల సహకారం తీసుకోవాలని సీఈఓ సూచించారు. స్లమ్ ఏరియాలు (బస్తీలు), గేటెడ్ కమ్యూనిటీలను స్వయంగా సందర్శించి అక్కడి ప్రతినిధులతో మాట్లాడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ తమ పరిధిలోని బీఎల్‌ఓలను సంప్రదించి స్వచ్ఛందంగా మ్యాపింగ్ చేయించుకోవాలని కోరారు. ఓటర్లకు సహాయం అందించేందుకు సూపర్ వైజర్ స్థాయి అధికారులతో ప్రత్యేక 'హెల్ప్ డెస్క్'లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలు, రేషన్ షాపు డీలర్లు, ఉద్యోగ సంఘాలను కూడా ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలన్నారు. మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు మరియు శాశ్వతంగా చిరునామా మార్చుకున్న ఓటర్ల వివరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నిబంధనల ప్రకారం అటువంటి ఓట్లపై తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే 80 ఏళ్లు పైబడిన ఓటర్ల మ్యాపింగ్‌ను కూడా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై మ్యాపింగ్ పురోగతిని వివరించాలని కలెక్టర్లకు తెలిపారు. ఎన్నికల విధుల్లో లేని అనధికార వ్యక్తులతో ఎటువంటి గోప్యసమాచారాన్ని పంచుకోవద్దని సీఈఓ హెచ్చరించారు. అటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇళ్లను లేదా ఓటర్లను గుర్తించడంలో మాత్రమే బీఎల్‌ఓల సహాయం తీసుకోవాలని, తప్పుగా జరిగిన మ్యాపింగ్‌లను తక్షణమే సరిదిద్దాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి, నోడల్ అధికారులు, ప్రాజెక్ట్ మేనేజర్లు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

# అందరికీ సమాన విద్యే మా లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

రూ. 1,100 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు. సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ అంటూ కులానికో రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయడం వల్ల సమాజంలో కుల వివక్ష పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివక్షను రూపుమాపేందుకే 100 నియోజకవర్గాల్లో రూ. 20 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణాన్ని చేపట్టామన్నారు. ఇక్కడ చదువుకున్న పేద బిడ్డలు గర్వంగా తమ పాఠశాల పేరు చెప్పుకోవాలని ఆకాంక్షించారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని నమ్మి, అందుకే విద్యాశాఖను మరెవరికీ ఇవ్వకుండా తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. సమీక్షల సమయంలో తనను సీఎంగా కాకుండా విద్యాశాఖ మంత్రిగా చూడాలని అధికారులను కోరారు. ప్రభుత్వ విద్యపై తమకున్న చిత్తశుద్ధిని చాటుతూ, అధికారంలోకి వచ్చిన కేవలం 60 రోజుల్లోనే 11,000 ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశామని సీఎం గుర్తు చేశారు. ఏలాంటి వివాదాలకు తావులేకుండా 36 వేల మంది టీచర్ల బదిలీలు, 22 వేల మందికి పదోన్నతులు కల్పించామని, ఈ విజయాన్ని నీతి ఆయోగ్ సైతం అభినందించిందని గర్వంగా ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను ప్రవేశపెడుతున్నామని, బడ్జెట్‌లో విద్యకు కేటాయింపులను 8 శాతం నుండి 15 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారు.

**నాణ్యత లేని కిట్లు ఇస్తే 'బొక్కలో' వేయిస్తా!**

విద్యార్థుల కోసం రూ. 1,000 కోట్లతో పంపిణీ చేస్తున్న ఎడ్యుకేషన్ కిట్ల నాణ్యతను తానే స్వయంగా పరిశీలించానని సీఎం తెలిపారు. విద్యార్థులకు నాణ్యత లేని వస్తువులను సరఫరా చేసే కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టడమే కాదు.. వారిని జైలుకు (బొక్కలో) పంపే బాధ్యత తనదని హెచ్చరించారు. విద్యార్థుల సంక్షేమం కోసం కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం, డైట్ ఛార్జీలను 40 శాతం పెంచామన్నారు. కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్టుగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించామని, త్వరలోనే అన్ని స్కూళ్లలో పాలు, రాగిజావతో కూడిన పోషకాహారాన్ని అందిస్తామని చెప్పారు. ఉపాధ్యాయులపై నమ్మకం ఉంచుతూ ఒకటో తారీఖునే జీతాలు అందజేస్తున్నామని, టీచర్లు తమ ఉద్యోగాన్ని కేవలం పనిగా కాకుండా ఒక బాధ్యతగా భావించాలని కోరారు. 19 లక్షల మంది పేద విద్యార్థుల భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని, వారి తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూడాలంటే టీచర్లు రోజుకు ఒక గంట అదనంగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. విదేశీ విద్యా విధానాలను అధ్యయనం చేయడానికి ఇప్పటికే 25 మంది టీచర్లను ఫిన్‌లాండ్‌కు పంపించామని, అవసరమైతే మరిన్ని దేశాలకు పంపిస్తామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలు అనాథ శరణాలయాలు కావని, అవి దేశ భవిష్యత్తును నిర్మించే వేదికలని ముఖ్యమంత్రి ఉద్వేగభరితంగా ప్రసంగించారు.



# రాష్ట్ర ప్రయోజనాల కోసమే కేంద్రంతో సఖ్యత



- బీజేపీ అంటే 'బ్రిటిష్ జనతా పార్టీ'
- విభజించి పాలించడమే వారి నైజం
- అనుభవరాహిత్యం, అహంకారంతో దేశానికి నష్టం
- చిట్‌చాట్‌లో సీఎం సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మే 11:** రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం తప్పనిసరి అని, అయితే తెలంగాణ హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ వైఖరి, రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై ఘాటుగా స్పందించారు. తాము బీజేపీని ఓడించి అధికారంలోకి వచ్చామని, కానీ రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కేంద్రాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిందేనని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీని 'బ్రిటిష్ జనతా పార్టీ'గా రేవంత్ రెడ్డి అభివర్ణించారు. బ్రిటిష్ వారి తరహాలోనే విభజించి పాలించడం ఆ పార్టీ సిద్ధాంతమని ఆరోపించారు. బీజేపీ ఎన్నికల విధానం 'జెమిని సర్కస్'లా ఉంటుందని ఎద్దేవా చేశారు. అనుభవరాహిత్యం, అహంకారం వల్ల దేశాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నారని మండిపడ్డారు. ప్రజలను బంగారం కొనొద్దు, విమానాల్లో ప్రయాణించొద్దు అని చెప్పడం కేంద్ర ప్రభుత్వ విదేశాంగ, ఆర్థిక విధానాల వైఫల్యమేనని ధ్వజమెత్తారు. ఏ రాష్ట్రంలో గెలవాలన్నా అక్కడ ఎఫ్‌ఐఆర్‌లను ఆయుధంగా వాడుకోవడం బీజేపీకి అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తన లక్ష్యమని, దీనికి ప్రధాని మోదీ కూడా అంగీకరించారని రేవంత్ తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టుకు కేంద్రం 50 శాతం నిధులు ఇవ్వాలని కోరామని, మెట్రో విస్తరణ, కాకతీయ టెక్స్‌టైల్ పార్క్, మూసీ ప్రాజెక్టు వంటి అంశాలపై కేంద్రం సానుకూలంగా స్పందించాలని ఆకాంక్షించారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం కేంద్రాన్ని నిధులు అడగలేదని, తాము మాత్రం తెలంగాణ హక్కుల కోసం అడుగుతున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఏకంగా 818 మంది మావోయిస్టులు సరెండర్ కావడం చారిత్రాత్మకమని సీఎం తెలిపారు. బుల్లెట్ కాదు బ్యాలెట్ అని కాంగ్రెస్ ఎప్పటి నుంచో చెబుతోందని, చివరకు మావోయిస్టులు కూడా అదే మార్గంలోకి వచ్చారని వ్యాఖ్యానించారు. గణపతి వంటి సీనియర్ నేతలు కూడా జనజీవన స్రవంతిలోకి రావాలని, వారికి ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహాయం అందిస్తామని పిలుపునిచ్చారు.

# బండి భగీరథ్ కేసుపై సీఎం సీరియస్

మొదటి పేజీ తరువాయి

కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. విచారణలో ఎలాంటి లోపాలు జరగకుండా, అత్యంత పారదర్శకత పాటించాలని సిట్ బృందానికి దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్‌ను చట్టప్రకారం రికార్డ్ చేసిన పోలీసులు, సంఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలు, కాల్ డేటా మరియు డిజిటల్ ఆధారాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటనలో ఉన్న సమయంలో ఈ కేసు వెలుగులోకి రావడంతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా ప్రకంపనలు మొదలయ్యాయి. కేంద్రమంత్రి కుమారుడు కావడంతోనే ప్రభుత్వం రక్షణ కల్పిస్తోందంటూ ప్రతిపక్షాల నుండి విమర్శలు వెల్లువెత్తాయి. అయితే, చట్టం ముందు ఎవరూ అతీతులు కారని, నేరం రుజువైతే కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం స్పష్టం చేసింది. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసుపై ప్రస్తుతం సిట్ బృందం దర్యాప్తును ముమ్మరం చేసింది. నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.





# పరారీలో బండి కొడుకు

**నిందితుడిని పట్టుకుంటాం**

**సిట్ చీఫ్ రితిరాజ్ ధీమా**

**హైదరాబాద్, మే 11:** రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టించిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పోక్సో కేసులో దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసు విచారణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం రంగంలోకి దిగింది. సిట్ చీఫ్, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ సోమవారం పేట్ బషీరాబాద్ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లతో సమీక్ష నిర్వహించి కేసు పురోగతిని పర్యవేక్షించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, ఈ కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని, త్వరలోనే అతడిని పట్టుకుంటామని స్పష్టం చేశారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్‌ఐఆర్ (684/2026) ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు డీసీపీ రితిరాజ్ తెలిపారు. ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్‌ను ఒకసారి రికార్డ్ చేశామని, మరిన్ని వివరాల కోసం మరోసారి స్టేట్‌మెంట్ తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఫోన్ కాల్ డేటా, ఇతర సాంకేతిక ఆధారాలను సేకరించాల్సి ఉందని, చట్టప్రకారం నేరం రుజువైతే నిందితుడిని కచ్చితంగా అరెస్ట్ చేస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. బాధితురాలికి న్యాయం చేయాల్సిన బాధ్యత తమపై ఉందని, దర్యాప్తులో ఎలాంటి జాప్యం జరగకుండా కార్యాచరణ సిద్ధం చేశామని వివరించారు.

# ఆరోగ్య శాఖలో కొలువుల పండగ

**నేడు 1919 మందికి నియామక పత్రాల అందజేత**

**నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం..**

**ఉస్మానియా మెడికల్ కాలేజీలో భారీ కార్యక్రమం**

**హాజరుకానున్న మంత్రి దామోదర రాజనర్సింహ**



**హైదరాబాద్, మే 11 :** అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు తీపి కబురు అందించింది. రాష్ట్ర ఆరోగ్య శాఖలో నూతనంగా ఎంపికైన 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు మంగళవారం నియామక పత్రాలను అందజేయనుంది. కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజ్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ భారీ బహిరంగ సభలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరై అభ్యర్థులకు ఆర్డర్లు అందజేస్తారు. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ద్వారా అత్యంత పారదర్శక పద్ధతిలో ఈ ఎంపిక ప్రక్రియ పూర్తయింది. ఆరోగ్య శాఖలోని 1919 పోస్టులతో పాటు కార్మిక (లేబర్) శాఖలో మరో 257 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను కూడా ప్రభుత్వం భర్తీ చేస్తోంది. భారీ సంఖ్యలో అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యే అవకాశం ఉండటంతో ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రాంగణంలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీరు, నీడ సౌకర్యంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ వసతులను మంత్రి స్వయంగా పర్యవేక్షించారు. ఈ నియామకాల ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏళ్ల తరబడి వేధిస్తున్న సిబ్బంది కొరత తీరనుంది. నూతనంగా ఎంపికైన నర్సింగ్ ఆఫీసర్లను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బోధనాసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నియమించనున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు ఈ నియామకాలు కీలకమని అధికారులు భావిస్తున్నారు. కరోనా వంటి క్లిష్ట సమయంలో నర్సులు అందించిన సేవలు వెలకట్టలేనివని, వారిని గౌరవించుకోవడానికే అంతర్జాతీయ నర్సుల దినోత్సవం రోజే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణలో నర్సుల పాత్ర ఎంతో గొప్పదని, కొత్తగా విధుల్లో చేరేవారు అంకితభావంతో పనిచేసి ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెంచాలని ఆయన ఆకాంక్షించారు. ఈ నియామక కార్యక్రమం ముగిసిన వెంటనే అభ్యర్థులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో విధుల్లో చేరాలని అధికారులు సూచించారు.



# గుప్తనిధుల కోసమే ఆలయం కూల్చివేత

## రేవంత్ డైరెక్షన్‌లోనే కూల్చివేతలు

## కూల్చిన ఆలయం వద్ద పరిశీలించిన హరీష్ రావు

**వరంగల్, మే 11:** లంకెబిందెల కోసమే పురాతమైన ఆలయాలను కూల్చివేస్తున్నారని, సీఎం రేవంత్ రెడ్డికి కూల్చడం తప్ప కట్టడం రాదని శాసనసభ విపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. వరంగల్ జిల్లా ఖానపురం మండలం అశోక్ నగర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేసిన 800 ఏండ్ల చారిత్రక కాకతీయ కట్టడం శివాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గుప్త నిధుల కోసం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపించారు. స్కూల్ నిర్మాణం కోసం అయితే అర్ధరాత్రి తవ్వకాలు ఎందుకు చేపట్టారని ప్రశ్నించారు. గర్భగుడి కింద 24 అడుగుల లోతు తవ్వాకాలు చేపట్టారని పురావస్తు శాఖ తేల్చింది. ఆలయాల కూల్చివేతపై ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుంత్వం రాగానే దేవాదాయ శాఖ భూమి ప్రభుత్వ భూమిగా మారిందన్నారు. గుప్త నిధుల వేటలో ప్రభుత్వ పెద్దలు ఉన్నారన్నారు. పేదల ఇళ్లతో పాటు గుళ్లను కూల్చివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో వరంగల్ జిల్లాలో ఎన్నో ఆలయాలను పునరద్ధరించామని గుర్తు చేశారు. రామప్ప ఆలయానికి బీఆర్ఎస్ యునెస్కో గుర్తింపు తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ధ్వంసం చేసిన శివాలయాన్ని పునర్మిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సూదర్శన్ రెడ్డి, దాస్యం వినయ భాస్కర్, అరూరి రమేష్, శంకర్ నాయక్ తదితరులు ఉన్నారు.

# రాష్ట్రానికి వచ్చి సుద్దులు చెప్పిన ప్రధాని

## అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా మాటలెందుకు

## ప్రధాని పర్యటనపై మంత్రి పొన్నం వ్యాఖ్యలు



**హైదరాబాద్, మే 11:** ప్రధానమంత్రి మోదీ తెలంగాణకు వచ్చి అభివృద్ధికి నిధులేమీ ఇవ్వకుండా పెట్రోల్, బంగారం, వంట నూనె వాడవద్దని చెప్పి వెళ్లారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. తెలంగాణకు ప్రధాని వస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందని ప్రజలు ఆశించారని, కానీ అభివృద్ధికి నిధులేమీ ప్రకటించకుండా పెట్రోల్, డీజిల్ వాడవద్దు.. బంగారం కొనవద్దు.. వంట నూనె వాడవద్దు అని చెప్పడం ప్రధాని హోదాకు తగదని అన్నారు. సోమవారం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. వేలాది కార్లతో రోడ్ షో చేసిన మోదీ ప్రజలకు భరోసా ఇవ్వాల్సింది పోయి భయాందోళనలు కలిగించారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ దర్యాప్తు చేయాలని భాజపా నేతలు గతంలో డిమాండ్ చేశారని, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించినా కేంద్రం ఎందుకు చేయడం లేదని మంత్రి ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన 12 ఏళ్లలో కేంద్రం ఏం చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు. ఆర్ఆర్ఆర్ నిధులు, మెట్రో నిధులు, రేడియల్ రోడ్లు, గోదావరి పుష్కరాలకు ప్రత్యేక నిధులు సహా రాష్ట్రానికి కావాల్సిన అభివృద్ధి అంశాలపై తెలంగాణలోని 8 మంది భాజపా ఎంపీలు.. ఒక్క వినతిపత్రమైనా ఇచ్చారా? అని మంత్రి నిలదీశారు. బీసీ హక్కులు, దేవాలయాల అభివృద్ధి, క్యూర్ ఏరియా అభివృద్ధి వంటి కీలక అంశాలపై తెలంగాణ భాజపా నేతలు మాట్లాడటం లేదని మంత్రి విమర్శించారు. రాహుల్ గాంధీ సూచనలతో తెలంగాణలో కులగణన నిర్వహించామని, జనగణనలో బీసీ కులాల వివరాలు చేర్చాలని కేంద్రాన్ని కోరినా మోదీ సర్కార్ స్పందించడం లేదని మంత్రి పొన్నం ఆరోపించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ నెరవేర్చలేదని విమర్శించారు. బండి సంజయ్ కుమారుడిపై వచ్చిన ఆరోపణల విషయంలో కేంద్ర మంత్రి హోదా ఉపయోగించి విచారణ అడ్డుకోవద్దన్నారు. విచారణ నిష్పక్షపాతంగా జరగాలని, దోషులకు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

# గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్



**హైదరాబాద్, మే 11:** గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను లోక్‌భవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి కలిసారు. జూన్ 12న పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థులతో నిర్వహించే సభకు గవర్నర్‌ను ఆహ్వానించారు. విద్యార్థులు పొగాకు, మద్యం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, బాధ్యతగల పౌరులుగా ప్రవర్తించాలని సభలో సామూహిక ప్రతిజ్ఞ చేయించనున్న ప్రభుత్వం. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి గతంలో సూచించిన గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా. గవర్నర్ సూచనను గౌరవిస్తు విద్యార్థులతో భారీ సభ ఏర్పాటు చేసి యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించనున్నట్లు ప్రభుత్వం నిర్ణయిం చింది. ఈ కార్యక్రమానికి గవర్నర్‌ను సీఎం ఆహ్వానించేందుకు కలిసారు.

# కార్మికుల సంక్షేమమే మా ధ్యేయం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్ కమిటీ కీలక భేటీ
- పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు
- శాస్త్రీయ పద్ధతిలో సవరణకు నిర్ణయం



**హైదరాబాద్, మే 11:** కార్మికుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. కార్మికుల జీవన ప్రమాణాలు పెంచడమే తమ ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యమని పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్‌కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి మంత్రులు, అధికారులు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి హాజరయ్యారు. శాస్త్రీయంగా కనీస వేతనాల సవరణ చేపడతామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇతర రాష్ట్రాల కనీస వేతన విధానాలపై సమీక్షిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్ ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించామని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు ఉండాలని కమిటీ సభ్యులు తెలిపారు. కేవలం అంకెల్లో కాదని.. వాస్తవ అవసరాలకు తగ్గట్టే వేతనాలు ఉండాలని చెప్పుకొచ్చారు. దేశంలో ఉత్తమ వేతన నమూనాలను తెలంగాణలో అమలు చేస్తామని భట్టి విక్రమార్క అన్నారు. కార్మికుల పక్షపాతి రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అసంఘటిత, సంఘటిత రంగ కార్మికులకు లాభం చేకూరేలా చర్యలు చేపడతామని అన్నారు. అన్నివర్గాల అభిప్రాయాలతో త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# సాగుకు సర్వం సిద్ధం

- మే నెలాఖరుకు 3.5 లక్షల టన్నుల యూరియా నిల్వలు
- రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ ఉత్పత్తిలో 90% తెలంగాణకే ఇవ్వాలి
- ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మితే చర్యలు
- మంత్రి తుమ్మల హెచ్చరిక



**హైదరాబాద్, మే 11:** రాష్ట్రంలో జూన్ మొదటి వారం నుంచే ఖరీఫ్ సాగు పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో, రైతులకు ఎరువుల కొరత రాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. సోమవారం సచివాలయంలో ఎరువుల కంపెనీల ప్రతినిధులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. మే నెలాఖరు నాటికి రాష్ట్రంలో 3.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వనరులను వాడుకుంటూ రామగుండం ఎరువుల కర్మాగారంలో తయారవుతున్న యూరియాలో కనీసం 90 శాతం వాటా తెలంగాణ రైతులకు కేటాయించాలని మంత్రి డిమాండ్ చేశారు. ఇక్కడ తయారైన ఎరువులు మన రైతులకు అందకపోవడం అన్యాయమని, దీనిపై ఆ సంస్థ ఎండీకి లేఖ రాయాలని సూచించారు. కేంద్రం నుంచి రావాల్సిన కోటాను కూడా యుద్ధప్రతిపాదికన తెప్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎరువులను ఎమ్మార్పీ ధర కంటే ఒక్క రూపాయి ఎక్కువకు అమ్మినా డీలర్లపై కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. అలాగే, రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి, నానో యూరియా మరియు సేంద్రియ పద్ధతుల వైపు మళ్లేలా అవగాహన కల్పించాలని కంపెనీలకు సూచించారు.

### డిసెంబర్ 9 నుండి అందుబాటులోకి 'కొహెడ' మార్కెట్

రాష్ట్ర మార్కెటింగ్ రంగంలో నూతన అధ్యాయానికి నాంది పలుకుతూ, కొహెడ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఈ ఏడాది డిసెంబర్ 9వ తేదీ నాటికి ప్రారంభించనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రూపొందించిన సవరించిన లేఅవుట్‌ను ఆయన అధికారులతో కలిసి సమీక్షించారు. సుమారు మూడు దశల్లో పూర్తి కానున్న ఈ ప్రాజెక్టులో ఓపెన్ ప్లాట్‌ఫారాలు, ట్రక్ డాకింగ్ షెడ్లు, కోల్డ్ స్టోరేజీలు మరియు అత్యాధునిక రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం బాటసింగారంలో ఉన్న లావాదేవీలను దశలవారీగా కొహెడకు తరలిస్తామని, దీనివల్ల రైతులకు దళారుల బెడద తప్పి తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు కృషి

## పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ఆస్తకి

## పరిశ్రమల శాఖ అధికారులతో సీఎస్ సమీక్ష



**హైదరాబాద్, మే 11:** తెలంగాణ రైజింగ్-2047 విజన్‌లో భాగంగా రాష్ట్రంలో భారీ పెట్టుబడులను ఆకర్షించదానికి పరిశ్రమలశాఖ అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పరిశ్రమలశాఖ అధికారులతో, ప్రాజెక్ట్ కన్‌స్టలెంట్లతో సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో పరిశ్రమలశాఖపై ఆయన సమీక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి వివిధ రాష్ట్రాల పారిశ్రామికవేత్తలు ఆస్తకి చూపుతున్నారని, ఆ దిశలో పరిశ్రమలశాఖ అధికార యంత్రాంగం సమాయత్తం కావాల్సిన అవసరం ఉందని, తగు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకొని పారిశ్రామికవేత్తలతో సమన్వయం చేసుకోవాలని ఆయన సూచించారు. ఎం.ఒ.యు.లతోపాటు పెట్టుబడి దారులకు అవసరమైన ఇతర మౌలిక వసతులను సమకూర్చాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పథకాలతోపాటు ఆయా రంగాలలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను కూడా పెట్టుబడుదారులకు తెలియపరిచి రాష్ట్రాభివృద్ధికి తోడ్పాలని సిఎస్ తెలిపారు. భారీ పెట్టుబడులతో పాటు స్థానిక యువతకు అధిక స్థాయిలో ఉద్యోగావకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఫార్మా రంగం, చేనేత ఉత్పత్తులు, టెక్స్‌టైల్ పార్కులు, ఐటి పరిశ్రమలు, డేటా సెంటర్లు, డ్రైపోర్టులు సంబంధిత రంగాల్లో పారిశ్రామికవేత్తలు భారీగా పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబరుస్తున్నారని, తెలంగాణ రైజింగ్ -2047 విజన్ కు వారు ఆకర్షితులవుతున్నందున అధికార యంత్రాంగం కూడా తగు కార్యాచరణ ప్రణాళికతో వారిని ప్రోత్సహించాలన్నారు. అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ తదితర ఐటి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నారని అధికారులు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగం, డెయిరీ ఉత్పత్తుల రంగంలో కూడా పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో వివిధ రంగాలలో పెట్టుబడులతో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని అధికారులు అన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# బండి కుమారుడిని ఎందుకు అరెస్ట్ చేయరు

## రేవంత్ కుమ్మక్కయ్యారన్న అనుమానం

## శాసన మండలి సభ్యులు రవీందర్ రావు



**హైదరాబాద్, మే 11:** బాలికపై లైంగికదాడి కేసులో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌ను పోలీసులు ఇంకా ఎందుకు అరెస్టు చేయడం లేదని శాసన మండలి సభ్యులు తక్కెళ్లపల్లి రవీందర్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రతిరోజూ దేశం కోసం, ధర్మం కోసం పోరాడుతున్నానని చెప్పే కేంద్రమంత్రి, తన కుమారుడు అఘాయి-ౘత్యం చేస్తే ఏమీ జరగలేదని వెనకేసుకు రావడం దారుణమన్నారు. పైగా ఇంత జరిగాక కూడా ఆయన ఏమీ ఎరుగనట్లు ప్రధాని సభలో పాల్గొనడం సిగ్గుచేటన్నారు. 'బేటీ బచావో' అంటూ నినాదాలిస్తూ నీతి వాక్యాలు పలికే బీజేపీ నేతలు, తమ కేంద్రమంత్రి ఒక మైనర్ ఆడపిల్ల పట్ల చేస్తున్న కుట్రలను ఖండించాలన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్, రాష్ట్ర హోం శాఖను నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఇద్దరూ కుమ్మక్కై ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్సీ రవీందర్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో ఒక బాలికకు అన్యాయం జరిగితే న్యాయం చేయలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇక ప్రజలకు ఏం న్యాయం చేస్తాయని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయించాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని, ఈ ఘటనపై న్యాయం కోసం ఉద్యమించి, దేశవ్యాప్తంగా అన్నిపక్షాల మద్దతు కూడగడుతుందని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు హెచ్చరించారు.

# మీ కొడుకు లైంగిక దాడి చేస్తే క్షమించవద్దు

## సునీతా కృష్ణన్ సంచలన పోస్ట్

## భగీరథ్ కేసు నేపథ్యంలో తల్లిదండ్రులకు పద్మశ్రీ అవార్డు గ్రహీత విజ్ఞప్తి



**హైదరాబాద్, మే 11:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైన వేళ, ప్రముఖ సామాజిక కార్యకర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత సునీతా కృష్ణన్ చేసిన ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సునీతా కృష్ణన్ తన పోస్ట్‌లో తల్లిదండ్రులకు కీలక విజ్ఞప్తి చేశారు. "తల్లిదండ్రులందరినీ నేను అభ్యర్థిస్తున్నాను.. ఒకవేళ మీ కొడుకు లైంగిక దాడులకు పాల్పడితే, అతన్ని కాపాడే ప్రయత్నం చేయకండి. ఇలాంటి తప్పులు చేస్తే కఠిన శిక్ష అనుభవించక తప్పదని వారికి తెలిసేలా చేయండి. అలా చేయడం వల్ల మీరు సమాజానికి గొప్ప సేవ చేసిన వారవుతారు" అని ఆమె పేర్కొన్నారు. బండి భగీరథ్ పేరును నేరుగా ప్రస్తావించకపోయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు పరోక్షంగా ఈ కేసును ఉద్దేశించినవేనని స్పష్టమవుతోంది. నేరాలకు పాల్పడే పిల్లలను వెనకేసుకొచ్చే ధోరణి సమాజానికి ప్రమాదకరమని ఆమె ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ ట్వీట్ ఇప్పుడు నెట్టింట అందరినీ ఆలోచింపజేస్తోంది.



సంపాదకీయం

# రాజకీయ పార్టీల్లో 'సర్' భయాలు!

## బోగస్, డబుల్ ఓట్ల తొలగింపుపై పార్టీల్లో గుబులు

## ప్రక్రియపై అప్రమత్తమైన కాంగ్రెస్, బీఆర్ఎస్, వైసీపీ

**'స్పెషల్ ఇన్టెన్సివ్ రిజర్వేషన్' (సర్) ప్రక్రియ పేరు వినగానే రాజకీయ పార్టీల్లో ఆందోళన మొదలైంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో త్వరలో చేపట్టబోతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలన కార్యక్రమం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రక్రియ ద్వారా చనిపోయిన వారి పేర్లు, బోగస్ ఓట్లు, డబుల్ ఓట్లు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఓట్లను గుర్తించి తొలగించనుండటంతో రాజకీయ పార్టీలు అప్రమత్తమవుతున్నాయి.**

ఇప్పటికే దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ అమలైంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు తమ నాయకులు, కార్యకర్తలకు బూత్ స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ చేస్తున్నాయి. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పార్టీ శ్రేణులకు హెచ్చరికలు పంపుతున్నాయి. అయితే ఓటర్ల జాబితా ప్రక్షాళన కొత్త విషయం కాదు. 1951 నుంచి 2004 వరకు దేశవ్యాప్తంగా ఇలాంటి ప్రత్యేక పరిశీలన కార్యక్రమాలు ఎనిమిది సార్లు నిర్వహించబడ్డాయి. కానీ 21 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ ప్రక్రియ చేపట్టడంతో రాజకీయ దుమారం చెలరేగుతోంది. గతంలో పెద్దగా వివాదాలు రాకపోయినా, ప్రస్తుతం మాత్రం ప్రతి చర్య రాజకీయ కోణంలోనే కనిపిస్తోంది. సర్ ప్రక్రియ పేరుతో లక్షలాది మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారనే ఆరోపణలు కొన్ని రాష్ట్రాల్లో వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం తీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు ఎన్నికల సంఘం మాత్రం పూర్తిస్థాయి పరిశీలనతోనే చర్యలు తీసుకుంటున్నామని చెబుతోంది. ఓటు అనేది రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన అత్యంత కీలకమైన హక్కు. ప్రజాస్వామ్యంలో ఓటరు నమోదవడం ఎంత ముఖ్యమో, అర్హత లేని ఓట్లు తొలగించడం కూడా అంతే అవసరం. చనిపోయిన వారి పేర్లు సంవత్సరాల తరబడి జాబితాలో కొనసాగడం, ఒకే వ్యక్తికి రెండు ప్రాంతాల్లో ఓట్లు ఉండటం, ఇతర రాష్ట్రాల్లో కూడా పేర్లు ఉండటం వంటి సమస్యలు ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలో తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్న ఉదాహరణలు అనేకం. రెండు విడతల ఎన్నికల సమయంలో రెండు చోట్ల ఓటు వేసిన ఘటనలూ వెలుగుచూశాయి. రాజకీయ పార్టీలు కూడా తమకు అనుకూలంగా బోగస్ ఓట్లను చేర్పించుకునేందుకు ప్రయత్నించాయన్న ఆరోపణలు అప్పట్లో వచ్చాయి. అందుకే ఇప్పుడు జరుగుతున్న పరిశీలనను కొందరు అవసరమైన సంస్కరణగా చూస్తున్నారు. ఇటీవల పశ్చిమ బెంగాల్, బీహార్ వంటి రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలో అనుమానాస్పద ఓట్లను తొలగించినట్లు సమాచారం. చొరబాటుదారులు, అక్రమ వలసదారులు, నకిలీ పత్రాలతో నమోదైన ఓట్లు పెద్ద సంఖ్యలో ఉన్నాయని ఎన్నికల సంఘం గుర్తించింది. దీంతో అక్కడ రాజకీయ వివాదాలు తీవ్రరూపం దాల్చాయి. అయితే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ఆధునిక సాంకేతికతను ఉపయోగించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆధార్, ఫోన్ నంబర్, బయోమెట్రిక్ వ్యవస్థలతో ఓటరు కార్డులను అనుసంధానం చేస్తే డబుల్ ఓట్లు, బోగస్ ఓట్లను సులభంగా అరికట్టవచ్చు. బ్యాంకు ఖాతాలు, పాన్ కార్డులు ఆధార్‌తో లింక్ చేసినట్లే ఓటరు కార్డులను కూడా లింక్ చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది. అదేవిధంగా ఓటరు జీవించి ఉన్నాడని నిర్ధారించుకునే ఆన్‌లైన్ ధృవీకరణ విధానం తీసుకురావాలని నిపుణులు సూచిస్తున్నారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండేలా ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించి, బయోమెట్రిక్ ఆధారిత ఓటింగ్ విధానం తీసుకువస్తే ఎన్నికల వ్యవస్థ మరింత పారదర్శకంగా మారుతుందని భావిస్తున్నారు. రాజకీయ పార్టీలు కూడా ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉంది. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగితే ఖచ్చితంగా ప్రశ్నించాలి. అదే సమయంలో బోగస్ ఓట్ల తొలగింపుకు కూడా సహకరించాలి. కానీ కొన్ని పార్టీలు మాత్రం తమ రాజకీయ ప్రయోజనాలకు దెబ్బ తగులుతుందనే భయంతో సర్ ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మొత్తానికి 'సర్' ప్రక్రియ ఇప్పుడు కేవలం ఓటర్ల జాబితా పరిశీలన మాత్రమే కాకుండా రాజకీయ వేడిని పెంచుతున్న కీలక అంశంగా మారింది. ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయాలంటే పారదర్శకమైన ఓటరు వ్యవస్థ అవసరం. అదే సమయంలో నిజమైన ఓటరికి అన్యాయం జరగకుండా చూడటం కూడా ఎన్నికల సంఘం ముందున్న అతిపెద్ద సవాల్‌గా మారింది.





# జూలై 1 నుంచి 'వీబీ జీ రామ్ జీ' అమలు



- 125 రోజులకు పెరగనున్న పనిదినాలు
- 20 ఏళ్ల నాటి చట్టానికి కేంద్రం స్వస్తి

**న్యూఢిల్లీ, మే 11:** దేశంలోని గ్రామీణ ఉపాధి రంగంలో కేంద్ర ప్రభుత్వం భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. గత రెండు దశాబ్దాలుగా కోట్లాది కుటుంబాలకు ఆసరాగా ఉన్న 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం'ను రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీని స్థానంలో 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్' పేరుతో సరికొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ నూతన వ్యవస్థ 2026, జులై 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సోమవారం అధికారికంగా ప్రకటించింది.

### 125 రోజుల ఉపాధి గ్యారెంటీ

ప్రస్తుతం అమల్లో ఉన్న ఎంజీనరేగా పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి గరిష్ఠంగా 100 రోజుల పని కల్పిస్తుండగా, కొత్తగా రాబోతున్న 'వీబీ జీ రామ్ జీ' చట్టం ద్వారా ఆ పరిమితిని 125 రోజులకు పెంచారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు, వారిని దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా పనిదినాలను పెంచినట్లు ప్రభుత్వం వెల్లడించింది. వికసిత్ భారత్-2047 లక్ష్యానికి అనుగుణంగా ఈ మార్పులు చేసినట్లు కేంద్రం పేర్కొంది.

### తొలగనున్న ఈ-కేవైసీ చిక్కులు

పథకాల మార్పు సమయంలో కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం కీలక హామీ ఇచ్చింది. ప్రస్తుతమున్న ఈ-కేవైసీ జాబ్ కార్డులే కొత్త కార్డులు వచ్చే వరకు చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. ఒకవేళ ఎవరికైనా ఈ-కేవైసీ ప్రక్రియ పెండింగ్‌లో ఉన్నా, వారికి ఉపాధి కల్పించడంలో ఎలాంటి అడ్డంకులు ఉండవని భరోసా ఇచ్చింది. జూన్ 30, 2026 నాటికి ఎంజీనరేగా కింద కొనసాగుతున్న అన్ని ప్రాజెక్టులు జులై 1 నుంచి నేరుగా కొత్త చట్టం పరిధిలోకి వస్తాయని, పనులు ఎక్కడా నిలిచిపోవని అధికారులు తెలిపారు.

### నిధుల కేటాయింపులో కొత్త విధానం

కొత్త చట్టం ప్రకారం నిధుల కేటాయింపులో కూడా మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈసారి ఉపాధి హామీ కోసం ఏకంగా రూ. 1.51 లక్షల కోట్లకు పైగా బడ్జెట్‌ను అంచనా వేస్తున్నారు. అలాగే పనుల పర్యవేక్షణ కోసం జీపీఎస్ ట్రాకింగ్, రియల్ టైమ్ డ్యాష్ బోర్డులు వంటి అత్యాధునిక సాంకేతికతను వాడనున్నారు. పనుల ఎంపికలో కూడా జలవనరుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తారు. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# భార్య భర్తకు బానిస కాదు..

- జంతువులా చూసే హక్కు లేదు
- ఆత్మగౌరవంతో బతికే హక్కు అందరికీ ఉంది
- సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- గృహ హింస కేసులో నిందితుడి ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరణ



**న్యూఢిల్లీ, మే 11 :** భార్య అంటే భర్తకు బానిస కాదని, ఆమెను జంతువులా చూసే హక్కు ఎవరికీ లేదని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. వివాహ బంధంలో ఉన్నంత మాత్రాన మహిళ తన ఆత్మగౌరవాన్ని వదులుకోవాల్సిన అవసరం లేదని, గౌరవంగా జీవించే హక్కు ఆమెకు ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. గృహ హింస కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఓ నిందితుడు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సందర్భంగా న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ పి.బి. వరాలేలతో కూడిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. పాట్నా హైకోర్టు ముందస్తు బెయిల్‌ను తిరస్కరించడంతో నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించగా, అక్కడ కూడా అతనికి నిరాశే ఎదురైంది. నిందితుడు తన మొదటి భార్యపై మద్యం మత్తులో దాడి చేశాడని, ఆమెను నేలపైకి నెట్టివేయడంతో తలకు ఇటుక తగిలి తీవ్ర గాయమైందని ప్రాసిక్యూషన్ కోర్టుకు వివరించింది. అంతేకాకుండా నిందితుడికి మొత్తం ముగ్గురు భార్యలు ఉన్నారని, బాధిత మహిళకు ఎటువంటి ఆర్థిక సాయం అందించడం లేదని తెలిపింది. అయితే, సదరు మహిళతో తనకు పెళ్లే కాలేదని నిందితుడు చేసిన వాదనను కోర్టు తోసిపుచ్చింది.

### మద్యం మత్తులో దాడులపై ఆందోళన

ఈ సందర్భంగా జస్టిస్ వరాలే స్పందిస్తూ.. భార్య పట్ల ఈ విధంగా క్రూరంగా ప్రవర్తించడాన్ని ఏమాత్రం సమర్థించలేమని మండిపడ్డారు. జస్టిస్ కుమార్ జోక్యం చేసుకుంటూ.. "మీరు భార్యను ఎందుకు కొట్టాలనుకుంటున్నారు? ఇలాగే కొడితే ఇప్పుడున్న భార్య కూడా మిమ్మల్ని వదిలి వెళ్ళిపోతుంది" అని నిందితుడిని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్లలో నమోదయ్యే గృహ హింస కేసుల్లో మద్యం సేవించి భార్యలపై దాడి చేయడం అనేది ఒక సాధారణ పద్ధతిగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు తమ భర్తలు మద్యం తాగడాన్ని భరించినా, తాగిన తర్వాత చేసే దాడులను మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అభిప్రాయపడ్డారు. నిందితుడిపై ఉన్న ఆరోపణలు తీవ్రమైనవని పేర్కొంటూ, ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది.



# జవాబుదారీదనం లేని ప్రధాని ప్రసంగం

## ఇలాంటి వారు దేశాన్ని నడపడం కష్టం

## ఎక్స్ వేదికగా రాహుల్ విమర్శలు

**న్యూఢిల్లీ, మే 11:** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మోదీ జవాబుదారీతనాన్ని కోల్పోయారని అన్నారు. ప్రజలు ఏం కొనాలో.. ఏం కొనకూడదో చెప్పే పరిస్థితికి మోదీ వచ్చారంటూ మండిపడ్డారు. తెలంగాణ సభలో మోదీ చెప్పినవి ప్రబోధాలు కావని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు అని అన్నారు. రాజీపడిన ప్రధాని మోదీ.. దేశాన్ని నడపడం కష్టమన్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో సోమవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ప్రతిసారీ బాధ్యతను ప్రజలపైనే నెట్టేస్తున్నారని, ఆయన మాత్రం జవాబుదారీతనం నుంచి తప్పించుకు తిరుగు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశంపై తీవ్రంగా ఉందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, యూరియా ధరలు అమాంతం పెరిగాయని తెలిపారు. రెండు నెలల నుంచి ప్రజలపై భారం పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, యుద్ధం కారణంగా వచ్చే నష్టాన్ని కేంద్రమే భరిస్తోందని వెల్లడించారు. క్లిష్ట సమయంలో దేశ ప్రజలు పెట్రోల్, డీజిల్ పరిమితంగా వినియోగించాలని కోరారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని.. వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ మీటింగ్‌లు పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా రవాణాను వినియోగించాలన్నారు. ఇవన్నీ కూడా ప్రజలను అప్రమత్తం చేసేవిగా లేవని రాహుల్ అన్నారు. కేవలం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నమని అన్నారు.

# ఇంధన భద్రతపై రాజ్‌నాథ్ సింగ్ కీలక భేటీ

### నిత్యావసరాల కొరత రాకుండా చర్యలు

**న్యూఢిల్లీ, మే 11 :** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా దేశ ఇంధన భద్రత, నిత్యావసర వస్తువుల సరఫరా వ్యవస్థలపై కేంద్ర ప్రభుత్వం అత్యున్నత స్థాయి అప్రమత్తత ప్రకటించింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో సోమవారం 'అనధికార మంత్రుల బృందం' 5వ సమావేశం జరిగింది. గ్లోబల్ సప్లై చైన్ (ప్రపంచ సరఫరా గొలుసు) దెబ్బతినే ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో, దేశీయంగా వస్తువుల లభ్యత మరియు ధరల నియంత్రణపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటోందని భరోసా ఇచ్చారు. నిత్యావసరాల కొరత రాకుండా పటిష్ఠమైన ప్రణాళికలు సిద్ధం చేశామని, ప్రజలు అనవసరంగా వస్తువులను నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గ్లోబల్ సవాళ్లను ఎదుర్కోవడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు.

### 60 రోజులకు సరిపడా నిల్వలు

గత ఏప్రిల్ 18న జరిగిన నాలుగో సమావేశంలో దేశంలో ప్రస్తుతం 60 రోజులకు సరిపడా



పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. నేటి ఐదో సమావేశంలో ఆ నిల్వలను మరింత పటిష్ఠం చేయడం, ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడం ద్వారా ఇంధన భద్రతను కాపాడాలని నిర్ణయించారు. యుద్ధ వాతావరణం నెలకొన్నప్పటికీ, దేశంలో ఉప్పు, పప్పు వంటి నిత్యావసరాల ధరలు పెరగకుండా నిరంతర నిఘా ఉంచుతున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

# కేరళంపై కాంగ్రెస్ మల్లగుల్లాలు

### సీఎం ఎవరనేదానిపై తేల్చుకోలేని పార్టీ

**న్యూఢిల్లీ/ తిరువనంతపురం:** తమిళనాట ముఖ్యమంత్రి పదవిపై ఏర్పడిన సందిగ్ధత వీడడంతో ఇప్పుడు అందరి దృష్టి పొరుగు రాష్ట్రం కేరళపై పడింది. ఫలితాలు వెలువడి ఐదు రోజులు గడుస్తున్నా.. సీఎం ఎవరనే దానిపై ఇంకా స్పష్టతరాలేదు. సీఎం ఎంపికపై ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సమావేశం జరిగినప్పటికీ.. సీఎం పేరును మాత్రం వెల్లడించలేదు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయఢంకా మోగించిన సంగతి తెలిసిందే. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షీ మీడియాతో మాట్లాడారు. సీఎం అభ్యర్థి ఎవరనే దానిపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని, పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు సంయమనం పాటించాలని కోరారు. నాయకత్వ ఎంపికపై అధిష్ఠానం సమష్టిగా నిర్ణయం తీసుకుంటుందన్నారు. మరోవైపు సీఎం ఎవరనేది ప్రకటించే ముందు మరోసారి చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



# ప్రజల భద్రతే మా లక్ష్యం

**హోంమంత్రి వంగలపూడి అనిత**

**ఆత్కూరులో నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభం**

**కృష్ణా జిల్లా, మే 11:** రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల భద్రత కోసం మరిన్ని ముందడుగులు వేస్తామని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. మంత్రి కొల్లు రవీంద్ర, స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి ఆమె రిబ్బన్ కట్ చేసి, భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హోంమంత్రి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకే ఆధునిక సౌకర్యాలతో ఈ నూతన భవనాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా, సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని ఆమె పేర్కొన్నారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖ ఆధునికీకరణపై దృష్టి సారించిందని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో భద్రతా భావాన్ని పెంచేందుకు క్షేత్రస్థాయిలో పోలీస్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని, అందులో భాగంగానే ఆత్కూరులో అన్ని వసతులతో కూడిన ఈ భవనాన్ని నిర్మించామని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల నేటితో నెరవేరిందని, భవిష్యత్తులో ఇక్కడ శాంతిభద్రతల పర్యవేక్షణ మరింత సులభతరం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు అత్యవసర సమయాల్లో త్వరితగతిన స్పందించేలా సిబ్బందికి అన్ని రకాల సాంకేతిక వసతులు కల్పించినట్లు అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# నేడు అనంతపురం జిల్లాలో జగన్ పర్యటన

**యూరప్ పర్యటన తర్వాత తొలి జిల్లా సందర్శన**

**పామిడిలో వివాహ రిసెప్షన్‌కు హాజరుకానున్న జగన్**

**భారీ ఏర్పాట్లు చేస్తున్న వైసీపీ శ్రేణులు**



**అనంతపురం, మే 11:** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. యూరప్ పర్యటన ముగించుకుని స్వదేశానికి వచ్చిన తర్వాత ఆయన చేపడుతున్న తొలి జిల్లా పర్యటన కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. జగన్ రాకను పురస్కరించుకుని స్థానికంగా పార్టీ నాయకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యాహ్నం అనంతపురం జిల్లాలోని పామిడికి చేరుకోనున్న జగన్, ఎమ్మెల్సీ మధుసూదన్ కుమారుడు చైతన్య మిత్ర వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అలాగే వైసీపీ నేత పామిడి వీరా కుమార్తె, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్‌పర్సన్ లిఖిత వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించనున్నారు. ఈ కార్యక్రమం గుంతకల్లు నియోజకవర్గ పరిధిలోని పామిడిలో జరగనుంది. జగన్ పర్యటన నేపథ్యంలో పామిడి ప్రాంతంలో పార్టీ కార్యకర్తలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన కీలక వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశముందని పార్టీ వర్గాలు తెలిపాయి. స్థానికంగా స్వాగత ఏర్పాట్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. భద్రతా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్యక్రమం జరిగే ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. జగన్ పర్యటన సజావుగా జరిగేలా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం జగన్ తిరిగి తాడేపల్లికి బయల్దేరనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. యూరప్ పర్యటన అనంతరం ఆయన మొదటి ప్రజా కార్యక్రమం కావడంతో వైసీపీ శ్రేణులు ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాయి.

# నిత్యానందరెడ్డి సరెండర్

**ఎస్పీ కార్యాలయంలో లొంగుబాటు**



**కడప, మే 11:** వైసీపీ నేత, కడప మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి లొంగిపోయారు. వైసీపీ కార్యకర్త పెద్ద దస్తగిరి హత్య కేసులో నిత్యానంద రెడ్డి ప్రధాన నిందితుడిగా ఉన్నారు. గత 20 రోజులుగా వైసీపీ నేత కోసం తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో పోలీసులు గాలిస్తున్నారు. ఎట్టకేలకు సోమవారం ఉదయం ఎస్పీ కార్యాలయంలో పోలీసుల ఎదుట నిత్యానంద రెడ్డి లొంగిపోయారు. కొద్దిరోజుల క్రితం కడపలో వైసీపీ కార్యకర్త పెద్ద దస్తగిరి దారుణ హత్యకు గురయ్యారు. హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు దాదాపు 11 మందిని అరెస్ట్ చేశారు. నిత్యానంద రెడ్డి చెప్పడం వల్లే దస్తగిరిని చంపినట్లు నిందితులు వాంగ్మూలం ఇచ్చారు. దీంతో ఈ కేసులో నిత్యానంద రెడ్డిని ప్రధాన నిందితుడిగా పోలీసులు చేర్చారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిత్యానంద రెడ్డి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిత్యానందరెడ్డి నివాసంలో సోదాలు జరిపిన పోలీసులు.. విలువైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు.

# పారిశ్రామిక ప్రగతిలో సీఐఐది కీలక భూమిక



**న్యూఢిల్లీ, మే 11:** పారిశ్రామిక పురోగతిలో సీఐఐది కీలక పాత్ర అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నా యుడు వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దే శం పారిశ్రామికంగా వృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. వినూత్న ఆలో చనలతో లక్ష్యాలు చేరుకోవచ్చని వివరించారు. 1990 నాటి ఆర్థిక సంస్కరణల ఫలితాలను ఇప్పుడు చూస్తున్నామని చెప్పుకొచ్చారు. సోమవారం ఢిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోదీ సుస్థిరమైన పాలన అంది స్తున్నారని తెలిపారు. ప్రజలు ఖర్చులు తగ్గించుకోవాలని మోదీ సూచించారని అన్నారు. సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనేందుకు కొన్ని అంశాలతో ప్రధాని మోదీ జాతీయ మిషన్‌ను ప్రకటించారు. ప్రధాని మిషన్‌ను అందరూ ముందుకు తీసుకెళ్లాలి. ఇది ప్రధాని టాస్క్ మాత్రమే కాదు, మనందరిది. సంక్షోభం నుంచి వచ్చిన సవాళ్లను అవకాశాలుగా మలుచుకోవాలి. సరైన సమయంలో సరైన నాయ కుడిగా మోదీ ఉన్నారని సీఎం వ్యాఖ్యానించారు. ప్రపంచంపై పశ్చిమాసియా యుద్ధ ప్రభావం తీవ్రంగా ఉందని వెల్లడించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం భారత్‌పై పడకుండా కేంద్ర ప్రభుత్వం చూసిందని తెలిపారు. ప్రస్తుతం ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు.. క్లీన్ ఎనర్జీ యుగం నడుస్తోందని వివరించారు. వికసిత్ భారత్ దిశగా ముందుకెళ్తున్నామని చెప్పుకొచ్చారు. భారత ఆర్థికవృద్ధి వేగంగా కదులుతోందని అన్నారు. పెట్టుబడులకు స్వర్గధామం ఆంధ్రప్రదేశ్ అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. భారత పరిశ్రమల ప్రోత్సాహానికి సీఐఐ సరైన వేదిక అని అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ, పారిశ్రామిక పురోగతిలో సీఐఐ కీలక పాత్ర పోషించిందని చెప్పారు. ప్రభుత్వాలు ఎకో సిస్టమ్‌ను మాత్రమే సృష్టిస్తాయని, ఇన్నోవేటర్లు, పారిశ్రామికవేత్తలు దీర్ఘకాల ఆర్థిక పరిపుష్టికి దోహదం చేస్తారని తెలిపారు. తనకు జాతీయ, రాష్ట్ర అజెండాలున్నాయని, వాటిని పారిశ్రామికవేత్తలు ప్రోత్సహిస్తారన్న నమ్మకం ఉందన్నారు. 1990 సంస్కరణల మాదిరిగా భారత్ మరో మైలురాయి ముంగిట ఉంది. ప్రస్తుతం ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు, క్లీన్ ఎనర్జీ యుగం నడుస్తోంది. ప్రతిభ, సాంకేతికత, ఆవిష్కరణలు తదుపరి గ్లోబల్ ఎకనమిక్ ఆర్డర్‌ను నిర్ధరిస్తాయి. ఆర్థిక సంస్కరణల వల్ల మనందరికీ సృజనాత్మకతతో వైవిధ్యంగా ఆలోచించే అవకాశం వచ్చింది. ఆర్థిక సంస్కరణలకు ముందు, తర్వాత ఎందరో ప్రధానులను చూశా. సరైన సమయంలో సరైన నాయకుడు మోదీ నేతృత్వం ఉండటం మన అదృష్టం. దేశంలో స్థిర ప్రభుత్వం కొనసాగుతోంది. భారత్ అన్‌స్టాపబుల్‌గా సాగుతోంది. గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతుందని చంద్రబాబు తెలిపారు.

# అమిత్‌షాతో చంద్రబాబు భేటీ

- ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అంశాలపై చర్చలు
- సీఆర్ పాటిల్‌తో ప్రత్యేక సమావేశం
- టీడీపీ ఎంపీలతో చంద్రబాబు సమీక్ష



**న్యూఢిల్లీ, మే 11:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. ఈ భేటీల్లో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కూడా పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రాధాన్యతలు, కేంద్ర సహకారంతో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఈ సమావేశాల్లో విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. ముఖ్యంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా తో జరిగిన సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు పరిపాలనా, భద్రతా, అభివృద్ధి అంశాలపై చర్చించినట్లు తెలిసింది. అలాగే కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తో సమావేశమై ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన నీటి ప్రాజెక్టులు, సాగునీటి అవసరాలు, జల వనరుల వినియోగంపై చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన పలు ప్రతిపాదనలను సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందించాలని కోరినట్లు సమాచారం. రాష్ట్ర మౌలిక వసతుల అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, కేంద్ర నిధుల అంశాలు కూడా చర్చకు వచ్చినట్లు తెలిసింది. అనంతరం సీఎం చంద్రబాబు టీడీపీ ఎంపీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి కొనసాగుతున్న కార్యక్రమాలను సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం మరింత బలోపేతం చేసి రాష్ట్ర పురోగతికి కృషి చేయాలని ఎంపీలకు సూచించినట్లు సమాచారం. రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాల్లో పార్లమెంట్ సభ్యులు చురుకైన పాత్ర పోషించాలని చంద్రబాబు సూచించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అభివృద్ధి కార్యక్రమాల అమలు, కేంద్ర నిధుల సాధన, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలో సమిష్టిగా పనిచేయాల్సిన అవసరాన్ని ఆయన వివరించినట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి లక్ష్యంగా కేంద్రంతో సమన్వయాన్ని మరింత పెంచే దిశగా సీఎం చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలు రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కేంద్ర మంత్రులతో జరిగిన ఈ వరుస సమావేశాలు రాష్ట్ర భవిష్యత్ ప్రాజెక్టుల అమలుకు దోహదపడే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సింగపూర్ సీఐసీ సీఈవోతో మంత్రి లోకేష్ భేటీ



**సింగపూర్, మే 11:** ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు, వాణిజ్య అవకాశాలను విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సింగపూర్ కమాడిటీస్ ఇంటిలిజెన్స్ సెంటర్ సీఈవో గ్లోరియా ఊతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో వాణిజ్య అనుసంధానం, ఎగుమతుల ప్రోత్సాహం, సమాచార మార్పిడి వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, సీఫుడ్, వ్యవసాయం, ఖనిజాలు, ఔషధ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ రంగాల్లో అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం పెంచేందుకు సింగపూర్ కమాడిటీస్ ఇంటిలిజెన్స్ సెంటర్‌తో భాగస్వామ్యం కోరుతున్నామని చెప్పారు. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఎగుమతిదారులకు అంతర్జాతీయ అవకాశాలు కల్పించే దిశగా సహకారం అవసరమని పేర్కొన్నారు. కమాడిటీ ఇంటిలిజెన్స్ సమాచార మార్పిడి, మార్కెట్ విశ్లేషణ, ఎగుమతి అవకాశాలపై పరస్పర సహకారం ఏర్పడితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఎంతో మేలు జరుగుతుందని లోకేష్ అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌ను వేగవంతమైన పారిశ్రామిక, వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలను పరిశీలిస్తామని గ్లోరియా ఊ తెలిపారు. భవిష్యత్తులో పరస్పర సహకార అవకాశాలపై సానుకూలంగా ముందుకు సాగేందుకు ఆసక్తి ఉన్నట్లు పేర్కొన్నారు. వాణిజ్య సమాచార వ్యవస్థలు, మార్కెట్ డేటా, అంతర్జాతీయ వ్యాపార అనుసంధానాల విషయంలో కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలిస్తామని చెప్పారు. ప్రపంచ మార్కెట్లతో అనుసంధానం పెంచి రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వర్గాలు తెలిపాయి. విదేశీ పెట్టుబడులు, ఎగుమతుల విస్తరణ ద్వారా ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఇటీవల విదేశీ పర్యటనల ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు ఆకర్షించే ప్రయత్నాల్లో నారా లోకేష్ చురుకుగా వ్యవహరిస్తున్నారు. సింగపూర్‌లో జరిగిన ఈ సమావేశం రాష్ట్రానికి కొత్త వాణిజ్య అవకాశాలకు మార్గం సుగమం చేసే అవకాశముందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

# ప్రపంచ స్థాయి ఈవెంట్ల కేంద్రంగా ఏపీ

- సింగపూర్‌లో సన్‌టెక్ సిటీని సందర్శించిన నారా లోకేష్
- ఎంఐసీఈ విధానంపై కీలక చర్చలు
- అంతర్జాతీయ పెట్టుబడులు, సదస్సులకు ఏపీ సిద్ధం



**సింగపూర్, మే 11:** ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి సమావేశాలు, ప్రదర్శనలు, అంతర్జాతీయ వ్యాపార కార్యక్రమాల కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నారా లోకేష్ తెలిపారు. సింగపూర్ పర్యటనలో భాగంగా ఆయన అక్కడి ప్రముఖ వాణిజ్య, ప్రదర్శన కేంద్రం సన్‌టెక్ సిటీ ని సందర్శించారు. ఈ సందర్భంగా డీపీ అర్బన్ ఆర్కిటెక్ట్ సంస్థ డైరెక్టర్ ఆనందన్ కరుణాకరన్ తో సమావేశమై కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, ప్రపంచస్థాయి మీటింగ్స్, ప్రోత్సాహక కార్యక్రమాలు, సమావేశాలు, ప్రదర్శనల కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయి వ్యాపార సదస్సులు, ప్రదర్శనలు, కార్పొరేట్ కార్యక్రమాలను ఆకర్షించేలా ప్రత్యేక ఎంఐసీఈ విధానాన్ని రూపొందిస్తున్నామని వెల్లడించారు. పర్యాటకం, వ్యాపారం, ఐటీ, సేవారంగాల అభివృద్ధికి ఎంఐసీఈ రంగం కీలకమని లోకేష్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు, కన్వెన్షన్ సెంటర్లు, ప్రదర్శన వేదికలు అభివృద్ధి చేస్తే రాష్ట్రానికి పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. సింగపూర్‌లో అమలవుతున్న నమూనాలను అధ్యయనం చేసి ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సన్‌టెక్ సిటీ నిర్వహణ, ఆధునిక మౌలిక వసతులు, అంతర్జాతీయ ఈవెంట్ల నిర్వహణ పద్ధతులపై లోకేష్ ప్రత్యేకంగా అవగాహన పొందినట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ స్థాయి ఈవెంట్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడంపై డీపీ అర్బన్ ఆర్కిటెక్ట్ ప్రతినిధులతో చర్చించినట్లు తెలిసింది. రాష్ట్రాన్ని వేగవంతమైన పెట్టుబడి గమ్యస్థానంగా మార్చేందుకు ప్రభుత్వం అనేక రంగాల్లో కొత్త విధానాలు తీసుకొస్తోందని అధికార వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా ఐటీ, ఎలక్ట్రానిక్స్, పర్యాటకం, సేవారంగాల్లో అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నాయి. సింగపూర్ పర్యటనలో భాగంగా నారా లోకేష్ పలు అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ పర్యటన ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు, సాంకేతిక భాగస్వామ్యాలు, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# బండి భగీరథను కాపాడుతున్న కాంగ్రెస్ సర్కార్.

- కాంగ్రెస్..బీజేపీలు ఒక్కటై అన్యాయం చేస్తుండ్రు
- బండి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలి
- భూపాలపల్లి మాజీ జెడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేష్ డిమాండ్



మైనర్ బాలికలను అత్యాచారయత్నం చేసిన ఘటనలో బండి భగీరథను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కాపాడే ప్రయత్నం చేస్తోందని భూపాలపల్లి మాజీ జెడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేష్ అన్నారు. సోమవారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకుడు కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్ కుమారుడు కావడంతోనే ఈ కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ కేసు విషయంలో కాంగ్రెస్ బీజేపీలు ఒక్కటై మహిళలకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు అండగా ఉంటామని, రక్షణ కల్పిస్తామంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదేపదే చెప్తున్నారని, మైనర్ బాలిక అత్యాచారయత్నం కేసుపై ఇప్పటి వరకు స్పందించకపోవడం, ఇప్పటి వరకు భగీరథను అరెస్టు చేయకపోవడం చూస్తుంటే అర్థం అవుతోందని, సీఎం మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఇద్దరు కలిసి మైనర్ బాలిక కుటుంబాన్ని నాశనం చేయాలని చూస్తున్నారన్నారని ఆమె ఆరోపించారు. ఈ కేసులో బండి భగీరథను వెంటనే పోలీసులు అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.. భగీరథను అరెస్టు చేయకుంటే బిఆర్ఎస్ పార్టీ తరపున మహిళలంతా ఏకమై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

# ఆత్మ రక్షణకు కరాటే దోహదం.

- ప్రతి ఒక్కరు స్వీయ రక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి..
- క్రీడల పట్ల ఆసక్తి కలిగిన ఎమ్మెల్యే దొరకడం అదృష్టం..
- సినీ నటుడు సుమన్..







**పటాన్చెరువు మే11( సమయం న్యూస్). :** పటాన్చెరులో అట్టహాసంగా ముగిసిన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక 10వ జాతీయస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీలు.. విజేతలకు సినీ నటుడు సుమన్ తో కలిసి బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్..ప్రస్తుత సమాజంలో స్వీయ రక్షణ కోసం విద్యార్థినిలు, మహిళలు తప్పకుండా కరాటే నేర్చుకోవాలని.. దీని ద్వారా మానసిక ప్రశాంతత.. శారీరక ధారుఢ్యత లభిస్తుందని సినీ నటుడు సుమన్ అన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని భారతరత్న పీవీ నరసింహారావు ఆడిటోరియంలో ఎమ్మెల్యే జిఎంఆర్ సౌజన్యంతో.. లక్కీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక పదవ జాతీయస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హీరో సుమన్ మాట్లాడుతూ క్రీడల పట్ల ఆసక్తి కలిగి.. నిరంతరం క్రీడల అభివృద్ధికి నిబద్ధతతో కృషి చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి దొరకడం పటాన్చెరు నియోజకవర్గం ప్రజల అదృష్టమని అన్నారు. గత పది సంవత్సరాలుగా జాతీయస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీలకు సహకారం అందించడం పట్ల అభినందనలు తెలిపారు. తాను విద్యార్థి దశ నుండి మార్షల్ ఆర్ట్స్ ని నేర్చుకోవడం ప్రారంభించామని.. 50 సంవత్సరాలు గడిచిన ఇంకా ఆసక్తి తగ్గలేదని తెలిపారు. చదువుతోపాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా ఏడాది పొడవునా వివిధ అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర జాతీయ స్థాయి క్రీడలకు పటాన్చెరు కేంద్రంగా నిలవడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, వెంకట్ రెడ్డి, వెంకటేష్, షకీల్, రామ్మోహన్, వినోద్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగ సందర్భంగా శాంతి సమావేశం

- కోస్గి సీఐ సైదులు,ఎస్సై బాలరాజు...నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



**కోస్గి మున్సిపల్,(మం)మే 11(సమయం న్యూస్) :** బక్రీద్ పండుగ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ,అక్రమ పశువుల రవాణా నియంత్రణ, శాంతియుతంగా పండుగ జరుపుకోవాలని కోస్గి పోలీసు స్టేషన్ లో ఖురేషి, హిందూ ముస్లిం మత పెద్దల లతో కోస్గి సీఐ సైదులు,ఎస్సై బాలరాజు లు శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ....బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. పశువుల కొనుగోలు, రవాణా,వధ ప్రక్రియల్లో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు,కోర్టు మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. రవాణా సమయంలో జంతువులకు సరైన సంరక్షణ కల్పిస్తూ మానవత్వంతో వ్యవహరించాలని,వాహనాల్లో అధిక సంఖ్యలో పశువులను ఎక్కించరాదని సూచించారు. తనిఖీల సమయంలో పోలీస్,వెటర్నరీ మరియు రవాణా శాఖ అధికారులకు సహకరించాలని తెలిపారు. చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా నకిలీ లేదా చెల్లని వెటర్నరీ సర్టిఫికెట్లు ఉపయోగించరాదని హెచ్చరించారు. అనుమతి లేని ప్రదేశాల్లో జంతువుల వధ,బహిరంగ ప్రదేశాల్లో మాంసం విక్రయాలు,ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా వ్యవహరించడం, సోషల్ మీడియాలో మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే పోస్టులు,వీడియోలు, ఫోటోలు షేర్ చేయడం వంటి చర్యలు చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. అక్రమంగా పశువుల రవాణా,నిషేధిత జంతువుల వధ, అనుమతులు లేకుండా స్లాటర్ హౌస్ నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పండుగ సమయంలో ప్రజల మనోభావాలను గౌరవిస్తూ సామరస్య వాతావరణం నెలకొనేలా వ్యవహరించాలని ఖురేషి నిర్వాహకులకు సూచించారు. పరిశుభ్రత,పారిశుధ్య ప్రమాణాలు పాటించడంతో పాటు వ్యర్థాలను సరైన విధంగా నిర్వహించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి కార్యకలాపాలను ఉపేక్షించబోమని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో వెటర్నరీ డాక్టర్ శివ కుమార్, హిందూ ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# తారా కళాశాలలో విద్యా వారోత్సవ ప్రారంభ సంబరాలు





**సంగారెడ్డి మే11( సమయం న్యూస్).:** తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి బి ప్రణాళిక కార్యక్రమములో భాగంగా నేటి నుండి 17వ తేదీ వరకు జరిగే విద్యా వారోత్సవాలు ఘనంగా ప్రారంభించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ తెలిపినారు. తారా కళాశాలలో ఇప్పటివరకు ప్రజా పాలన ప్రగతి పాలన కార్యక్రమంలో విజయవంతంగా జాబ్ మేళా తో పాటు అనేక కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపల్ తెలిపినారు. అదే విధంగా విద్యా వారోత్సవాల ప్రారంభం సందర్భంగా మొదటి రోజు కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, బిస్లరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ వారితో అవగాహన ఒప్పందాన్ని చేసుకోవడం జరిగిందని తెలిపినారు. అవగాహన ఒప్పందంలో భాగంగా వచ్చే మూడు సంవత్సరాలలో కళాశాలను ప్లాస్టిక్ రహిత కళాశాలగా తీర్చిదిద్దుతామని, బిస్లరీ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారి సహకారంతో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడంతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలతో రీసైకిల్ చేసి ఎటువంటి పరికరాలను తయారు చేయవచ్చు వాలంటీర్లకు నేర్పడం జరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా కళాశాలలో నూతనంగా నిర్మించిన బీకాం (బిఎస్ఎఫ్ఐ మరియు హెచ్ఆర్) విభాగాలకు సంబంధించి ఆరు క్లాస్ రూములను ఇనాగరేట్ చేయడం జరిగిందని తెలిపినారు. అదే విధంగా ఈరోజు లాల్ బహదూర్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న విద్యా వారోత్సవాల కార్యక్రమానికి కళాశాల నుండి 150 మంది విద్యార్థులతో పాటు అధ్యాపకులు కూడా వెళ్లడం జరిగిందని తెలిపినారు. కళాశాలలో విద్యార్థులకు విద్యతో పాటు ఇటువంటి సామాజిక అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వాములను చేస్తున్నామని తెలిపినారు. ఈ కార్యక్రమములో కళాశాల వైస్ ప్రిన్సిపల్ నిర్మల ,డాక్టర్ జగదీశ్వర్ ,కామర్స్ విభాగ అధిపతి జ్యోతి, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ రత్న ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ అధికారులు, వివిధ శాఖల అధిపతులు, అధ్యాపక బృందము తదితరులు పాల్గొన్నారు.


# బండి సంజయ్ కుమారుడు భాగీరత్ ను వెంటనే రెస్ట్ చేయాలి



**రాయికోడ్ సమయం న్యూస్ మే 11** బండి సంజయ్ కుమారడు బండి సాయి భగీరత్ ను వెంటనే అరెస్టు చేయాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, కార్యదర్శి చేవెల్ విట్టల్,కొల్లూరు శంకర్ రాయికోడ్ గ్రామ సర్పంచ్ రాధా తుకారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రమైన రాయికోడ్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ... కేంద్ర మంత్రి పదవిలో ఉండడంతో తన కుమారుని అరెస్టు చేయడంలో తప్పిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో సామాన్యులకు ఒక రకమైనటువంటి న్యాయం,రాజకీయ పదవుల్లో ఉన్నటువంటి వారికి ఒక రకమైనటువంటి న్యాయం జరుగుతుందని అన్నారు. బాధితురాలికి న్యాయం జరగాలని వారు అన్నారు. తప్పు చేసిన ఎలాంటి వ్యక్తికైనా చట్టపరమైనటువంటి శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బాలికలకు రక్షణ కరువైందని అన్నారు. వేదికల మీద బాలికలు, ఆడవారు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఉపన్యాసాలు ఇవ్వడం కాదు. తప్పు చేసిన ఎంతటి వారినైనా శిక్షించాలని వారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంగమేశ్వర్, గ్రామ ఉపసర్పంచ్ శివకుమార్ ,మాజీ ఉప సర్పంచ్ రాములు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పోతంగల్‌లో ఘనంగా యం యం ఆర్ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవం

- రిబ్బన్ కట్ చేసిన పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాసుల బాలరాజ్..



**పోతంగల్, మే 11 (సమయం న్యూస్ ) :-** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన లియం యం ఆర్ లిలిఫంక్షన్ హాల్ (కళ్యాణ మండపం)లి ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే లిపోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ లిలికాసుల బాలరాజ్‌లి హాజరై, రిబ్బన్ కట్ చేసి ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోతంగల్ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆధునిక హంగులతో ఈ ఫంక్షన్ హాల్‌ను నిర్మించడం సంతోషకరమని అన్నారు. శుభకార్యాల నిర్వహణకు ఇది ఒక చక్కని వేదికగా నిలుస్తుందని గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆధునిక వసతులతో కూడిన ఫంక్షన్ హాళ్లు అందుబాటులోకి రావడం శుభపరిణామమని కొనియాడారు. శుభకార్యాల కోసం ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా, స్థానికంగానే అన్ని సౌకర్యాలతో ఈ మండపాన్ని నిర్మించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉంటూ, నాణ్యమైన సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి పీఏసీస్ బాన్సువాడ చైర్మన్,పుప్పాల శంకర్,మాజీఎంపీపీగంధపుపవన్,ఏజజ్ఖాన్,నబీ,షిరాజోద్దీన్,గంగాధర్, రాంబాబు , ఫంక్షన్ హాల్ యజమానులు మండవ దిలీప్ కుమార్, మల్లెపూల రాజాగౌడ్, మరియు మేనేజింగ్ పార్ట్నర్లు బ్రహ్మ రెడ్డి, కుర్లెపు గజానన్, గంగం మహేందర్, కేశ క్రాంతి కుమార్ తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జనగణన-2027 అవగాహన మారథాన్ రన్/వాక్ విజయవంతం చేయాలి

**ప్రతి ఒక్కరూ జనగణనలో భాగస్వాములు కావాలి : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి, మే 11:--జనగణన- 2027 :** కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ నెల 12వ తేదీ మంగళవారం ఉదయం 7:30 గంటలకు సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుండి ఐబి వరకు మారథాన్ రన్/వాక్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. దేశ అభివృద్ధి ప్రణాళికలకు జనగణన కీలక ఆధారమని, ప్రతి పౌరుడు జనగణనలో తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలని కలెక్టర్ సూచించారు. ఈ మారథాన్ రన్‌లో యువత, విద్యార్థులు, అన్ని శాఖల ఉద్యోగులు,అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.



అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియలో భాగంగా ఈరోజు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తో జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీల జాయింట్ యాక్షన్ కమిటీ మినిస్టర్ క్వార్టర్స్ లో భేటీ అయ్యింది. ఈ సమావేశంలో ఐడపీఆర్ కమిషనర్ జి. ముకుందరెడ్డి కూడా పాల్గొన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు, భవిష్యత్ కార్యాచరణపై చర్చ జరిగింది.

# నెల రోజుల పాటు టీఆర్ఎస్ జెండా పండుగ

- రాష్ట్ర రాజధాని నుంచి వార్డు స్థాయి వరకు పార్టీ జెండాలు ఆవిష్కరించాలి
- పార్టీ శ్రేణులకు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్ మే11( సమయం న్యూ స్).** : "తెలంగాణ రక్షణ సేన" పార్టీ భావజాలాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు మే 20 నుంచి నెల రోజుల పాటు జెండా పండుగ నిర్వ హించాలని పార్టీ శ్రేణులకు పిలుపుని స్తున్నాను ఈ నెల 20 నుంచి జూన్ 20వ తేదీ వరకు నెల రోజులపాటు రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాలతో పాటు నియోజకవర్గ, మండల కేంద్రాలు, గ్రామ స్థాయి వరకు పెద్ద ఎత్తున జెండా పండుగ నిర్వహిం చాలి.. అన్ని వార్డుల్లోనూ టీఆర్ఎస్ జెండాలు ఎగురవేయాలి. టీఆర్ఎస్ ఆవిర్భావ సభలో ప్రకటించిన పార్టీ విధానాలను, పాంచజన్య సిద్ధాంతా లను ప్రజలకు వివరించాలి. రాష్ట్రం ఆవిర్భవించి 12 ఏళ్లు గడిచిన తర్వాత కూడా మన తెలంగాణ గడ్డ అనేక విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నదితెలంగాణ ఉద్యమ నినాదాలైన నీళ్లు - నిధులు - నియామకాలను సాకారం చేసుకోవడంలోనూ వంచనకు గురయ్యాము వలస పాలన నాటి దుష్పరిణామాలను మనం ఇప్పుడు మళ్లీ ఎదుర్కొంటున్నామ ుతెలంగాణ తెచ్చుకుంటే మన బతుకులు మారుతాయని అనుకున్న ప్రతివర్గం అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతోందిస్వరాష్ట్ర సాధనకు అవిశ్రాంతంగా ఉ ద్యమించిన మనం తెలంగాణ పునర్నిర్మాణం, సబ్బండ వర్గాల వికాసం కోసం ఉ ద్యమించాల్సిన సమయం వచ్చిందిఅందుకే తెలంగాణ రక్షణ సేన జెండా ను ప్రతి వాడకు, పార్టీ సిద్ధాంతాలను ప్రతి గడపకు తీసుకెళ్లాల్సి ఉందిపార్టీ ఆవిర్భావానికి మూడు నెలల ముందు నుంచే పెద్ద ఎత్తున మనతో చేరిన నాయకత్వంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తెలంగాణ జాగృతి నాయకత్వం జెండా పండుగను విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నాను

# జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజావాణి" కార్యక్రమం..

- ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించి,
- బాధితులకు తక్షణ భరోసా కల్పించడమే లక్ష్యం
- ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్



**వికారాబాద్, మే,11(సమయం న్యూస్) :**ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించి, బాధితులకు తక్షణ భరోసా కల్పించడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజావాణి" కార్యక్రమం సోమవారం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ స్వయంగా ఫిర్యాదుదారులను కలిసి, వారి సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకున్నారు. బాధితులు తమ ఫిర్యాదుల కోసం ఎప్పుడైనా ఎస్పీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ఆపదలో ఉన్న వారికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. నేటి ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల నుండి పలు ఫిర్యాదులు అందడం జరిగింది. వీటిపై తక్షణమే స్పందించిన ఎస్పీ, సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు (ా.ఎ.ా) ఫోన్ ద్వారా సంప్రదించి, ఫిర్యాదుల గురించి ఆరా తీశారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను ఏమాత్రం జాప్యం చేయకుండా, పూర్తి పారదర్శకతతో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు మరియు బలహీన వర్గాల ఫిర్యాదుల పట్ల అత్యంత మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని కంప్యూటరైజ్ చేస్తున్నామని, తద్వారా ఫిర్యాదు పరిష్కారమయ్యే వరకు ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించేలా ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బాధితులు అవసరం అనుకుంటే నేరుగా తనను కలవవచ్చని తెలిపారు.

## మే 11 నుండి జూన్ 9 వరకు గృహ గణన జరుగుతుంది ప్రజలు సహకరించి మీ గృహాల వివరాలు తెలియ పరచుకోవాలి...

- మద్దూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్



**మద్దూర్ మున్సిపల్, మే,11(సమయం న్యూస్) :** జనాభా గణన జవఅంబం 2026- 27 కేంద్ర ప్రభుత్వం మొట్టమొ దటి సారిగా జనాభా గణన డిజిటల్ లో నిర్వహించడం జరుగుతుందని మద్దూర్ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు.. ఇట్టి కార్యక్రమంలో ప్రజలందరూ సహకరించి మీ యొక్క వివరాలను డిజిటల్ లో పొందుపరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమం మే 11 నుండి జూన్ 9 వరకు గృహ గణన జరుగుతుంది. ప్రజలు మీ ఇంటి దగ్గరికి వచ్చే ఏనుమిరేటర్స్ కు సహకరించి మీ గృహల వివరాలను తెలియపరచాలన్నారు. ఇట్టి కార్యక్రమానికి అందరూ ప్రజలు సహకరించాలని. మద్దూర్ చార్జి ఆఫీసర్ ఉ మున్సిపల్ కమిషనర్ సి. శ్రీకాంత్ కోరారు.

# ఒకటో వార్డులో పర్యటించిన జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక ఐఏఎస్

- క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనుల పరిశీలన.
- వయోవృద్ధుల ఆశ్రమం, బాల సదనం సందర్శన.



**నారాయణపేట, మే,11(సమయం న్యూస్) :** జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సోమవారం ఉదయం నారాయణపేట మున్సిపాలిటీలో పరిధిలో గల ఒకటో వార్డులో విస్తృతంగా పర్యటించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 90 రోజుల కార్యాచరణలో భాగంగా ఒకటో వార్డులో కొనసాగుతున్న పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్ ను మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్ తో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరిశీలనలో భాగంగా వార్డులో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని వార్డు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, మురుగు కాల్వల పరిశుభ్రతపై ఎలా ఉందో వార్డు వాసులతో వాకబు చేశారు. ఇళ్లలో పోగు అయ్యే చెత్తను చెత్తను మున్సిపాలిటీ చెత్త సేకరణ ఆటోలలోనే వెయ్యాలని, ఆరుబయట పరిసరాలలో వేయవద్దని వార్డు ప్రజలకు కలెక్టర్ సూచించారు. వార్డులలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలని, పారిశుద్ధ్య సేవలను మరింత మెరుగు పరచాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అంతకు ముందు కలెక్టర్ ఒకటో వార్డు బారంబావి సమీపంలో గల వయోవృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించి, అక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధుల యోగ క్షేమాల గురించి అడిగి, వారిని ఎంతో ఆప్యాయంగా పలకరించారు. ఆశ్రమంలో ఎంతమంది వృద్ధులు ఉన్నారని, వారికి కల్పిస్తున్న వసతి సదుపాయాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో అవసరైన సదుపాయాలను నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పక్కనే ఉన్న బాలసదన్ కూడా కలెక్టర్ సందర్శించారు అక్కడున్న విద్యార్థుల తో ముచ్చటించారు. విద్యార్థుల వివరాలను తెలుసుకున్న ఆమె ఎవరెవరు ఏ, ఏ తరగతులు చదువుతున్నారనీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సదనం లోని గదులను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, భోజన సదుపాయాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ మంజుల, కమిషనర్ ఎన్. శంకర్, వార్డు కౌన్సిలర్ సుతారి సత్య రఘుపాల్ రెడ్డి, ఇంజినీర్ మహేష్, పర్యావరణ ఇంజనీర్ భరత్, మున్సిపాలిటీ జవాన్లు, వాటర్, ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విజ్ఞాన వేదిక

## - దామరగిద్దలో 'వేసవి వినోదం' అట్టహాసంగా ప్రారంభం!

- జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక ఐఏఎస్
- చదువుతో పాటు నైపుణ్యాల సాధనే లక్ష్యం; విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పెద్దపీట
- ప్రతి విద్యార్థి ఈ సెలవుల్లో కనీసం 10 పుస్తకాలు చదవాలి: కలెక్టర్ పిలుపు



**దామరగిద్ద మండలం, మే 11(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం లోని ప్లూవీ ాఌ=× జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసే 'వేసవి వినోదం' శిక్షణా శిబిరం సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ సి. హెచ్. ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. అన్ని రంగాల్లో నైపుణ్యమే లక్ష్యం ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేవలం మార్కులే కాకుండా, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే ఈ క్యాంప్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఌనైపుణ్యాభివృద్ధి:ఌ గణితం, సైన్స్ వంటి సబ్జెక్టులతో పాటు కంప్యూటర్ కోడింగ్, లీడర్‌షిప్ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తారు. ఌయోగాతో ఆరోగ్యం: ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు యోగా, ధ్యానం ద్వారా శారీరక మరియు మానసిక దృఢత్వాన్ని పెంచుతారు. పుస్తక పఠనం:ఌ సెల్‌ఫోన్లకు పరిమితం కాకుండా, ఈ వేసవిలో మన చరిత్ర మరియు కథలకు సంబంధించిన కనీసం ఌ10 పుస్తకాలనుఌ చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆర్థిక స్వతంత్రం:ఌ ఆడపిల్లలకు చదువు ద్వారానే ఆర్థిక స్వతంత్రం, సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 17 కేంద్రాలు - పకడ్బందీ ఏర్పాట్లుజిల్లాలో ఇప్పటివరకు ఌ17 కేంద్రాలనుఌ విజయవంతంగా ప్రారంభించుకున్నామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని వసతులు కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఈ శిబిరాల కోసం ప్రభుత్వం సుమారు ఌరూ. 10.75 లక్షలఌ బడ్జెట్‌ను కేటాయించిందని, విద్యార్థులకు భోజనం, ఆటపాటలు మరియు విద్యా సామాగ్రిని అందజేస్తున్నట్లు వివరించారు. ఉపాధ్యాయుల పాత్ర కీలకం ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థుల ప్రతిభను వెలికితీయాలని కలెక్టర్ సూచించారు. గత ఏడాది సమ్మర్ క్యాంప్‌ల ద్వారా పాఠశాలల్లో డ్రాపౌట్స్ సంఖ్య గణనీయంగా తగ్గిందని, ఈ ఏడాది కూడా అదే ఫలితాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్, ఏఎంఓ విద్యాసాగర్, సీఎంఓ రాజేంద్ర కుమార్, ఏఎస్ఓ నాగార్జున రెడ్డి, ఎంఈఓ కృష్ణారెడ్డి, వివిధ గ్రామ ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# రాయపోల్‌లో పీడీఎస్ బియ్యం పట్టివేత

- 200 క్వింటాళ్లకు పైగా స్వాధీనం



**రాయపోల్, మే 11:** రాయపోల్ మండలంలో అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నమ్మకమైన సమాచారంతో సోమవారం మధ్యాహ్నం వడ్డేపల్లి గ్రామంలోని సాయి వీరభద్ర రైస్ మిల్‌పై సంయుక్తంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో 200 క్వింటాళ్లకు పైగా పీడీఎస్ బియ్యం (ఖీ=ఖ కర్నల్స్‌తో కూడిన సన్నబియ్యం) పట్టుబడింది. బియ్యాన్ని 137 గన్నీ సంచులు, 341 మల్టీకలర్ ప్లాస్టిక్ సంచుల్లో అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. సిద్ధిపేట జిల్లా ూజూూ సాయి రవి పంచనామా నిర్వహించి, మిల్ నిర్వాహకుడు రత్నాకర్‌పై కేసు నమోదు చేశారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. దాడిలో ఌూా వెంకటేశం, జ× పాండరీ, ా× వెంకటేశ్వర్లు, ూజూూ సాయి రవి, రాయపోల్ ాఌూ కె. మనసా పాల్గొన్నారు.

# ప్రజావాణికి 41 ఫిర్యాదులు

- ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ ప్రియాంక ఐఏఎస్.



**నారాయణపేట, మే,11(సమయం న్యూస్) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి. హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ కు సమర్పించగా, ప్రజల ఫిర్యాదులను సమస్యలను సావధానంగా విన్న కలెక్టర్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా సోమవారం నాటి ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 41 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ ఫణీంద్ర రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సంపదను కాంగ్రెస్ బిజెపి ప్రభుత్వాలు దోచుకుంటున్నాయి

-వంటేరు ప్రతాప్ రెడ్డి



**సమయం న్యూస్ గజ్వేల్ మే 11 :** గజ్వేల్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూతెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ బంగారం కొనొద్దు , పెట్రోల్ ,డీజిల్ కోసం ప్రజలు తిరిగొద్దని, ఆయిల్స్ వాడవద్దని నిన్న సభలో ప్రధాని మోదీ అనడం చాలా దారుణమని భారతదేశానికి స్వతంత్రం వచ్చి 80 సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటి వరకు ఏ ప్రధానమంత్రి కూడా ఇలాంటి ఆంక్షలు పెట్టలేదు అన్నారు.కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్నిటి మీద ఆంక్షలతో ధరలు పెంచుతున్నారని పెట్రోల్ డీజిల్ బంగారం గ్యాస్ నిత్యవసర సరుకులు ధరలు పెరగడానికి కారణం కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కాద అని ప్రశ్నించారుకేంద్రంలో నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వానికి ముందు చూపు లేక ప్రణాళిక లేక తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని దీనికి కారణం కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వమే అని అన్నారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకును ఫోక్సో కేసు విషయంలో వెంటనే అరెస్టు చేసి రిమాండ్ కు తరలించాలి డిమాండ్ చేశారు.పక్క దేశం చైనా ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైన రెండున్నర సంవత్సరాల గాను పెట్రోల్ డీజిల్ గ్యాస్ లను నిలువ చేసుకునే సామర్థ్యం పెంచుకుంది కానీ మనదేశంలో నరేంద్ర మోడీ అనాలోచితమైన విధానాల వలన, ముందు చూపు లేకపోవడం వలన, ప్రణాళికలు లేకపోవడం వలన రెండు నెలలకు సరిపడే పెట్రోల్ డీజిల్ నిల్వలు లేకపోవడం చాలా బాధాకరమని టెక్నాలజీలో చాలా వెనుకబాటులో ఉన్నాము ధరలు పెరగడానికి కారణం రూపాయి విలువ పతనమే అని దానికి కారణం కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు.నరేంద్ర మోడీ ప్రధాని అయ్యాక ఎగుమతులు తగ్గి దిగుమతులు పెరిగాయి అని తెలిపారు ఈ అసమర్థతకు కారణం కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు.గడిచిన 12 సంవత్సరాల కాలంలో రెండు వందల లక్షల కోట్లు అప్పు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కాదా రెండు లక్షల కోట్ల అప్పు ఏ అభివృద్ధి కార్యక్రమానికి వినియోగించారు, ఏ ఒక్క ప్రాజెక్టును కట్టారు ప్రజలకు మోడీ సమాధానం చెప్పాలి, అబద్ధపు అసత్యపు హామీలతో అధికారం చేపట్టిన నరేంద్ర మోడీ ప్రభుత్వం కుబేరుల నల్లధనాన్ని స్విస్ బ్యాంకుల నుండి వెనక్కి తీసుకువచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో 15 లక్షలు జమ చేస్తామని చెప్పి ఇప్పటివరకు ఎన్ని కోట్ల మంది ఖాతాలో 15 లక్షల జమ చేశారో భారతదేశ ప్రజలకు నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలన్నారునరేంద్ర మోదీ.రేవంత్ రెడ్డి ల దోస్తానా ఏందో చెప్పాలిలేక కాంగ్రెస్ బిజెపి రెండు పార్టీలు ఒకటెన. అని ప్రశ్నించారు బడే బాయ్ చోట బాయ్ దోస్తానా నరేంద్ర మోడీ రాకతో తేటతెల్లమైందని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర సంపదను కాంగ్రెస్ బిజెపి ప్రభుత్వాలు దోచుకుంటున్నాయని మండిపడ్డారు,రాబోయే రోజులలో తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేసిన మోసం చేస్తున్న కాంగ్రెస్ బిజెపి పార్టీలను తెలంగాణ ప్రజలు బొంద పెట్టడం ఖాయమన్నారు .గడిచిన 10 సంవత్సరాల కెసిఆర్ పాలనలో కేంద్రంలో నరేంద్ర మోడీ తెలంగాణ రాష్ట్రంపై విషం కక్కి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సంక్షేమాన్ని అడ్డుకున్నారని తెలిపారు. ఒక్క ప్రాజెక్టు కూడా జాతీయ హోదా కల్పించలేదని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందనా రవీందర్, వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగరావు, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, మండల పార్టీ అధ్యక్షుడు బెండే మధుమాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ఉడెం కృష్ణారెడ్డి కౌన్సిలర్లు అత్తిలి శ్రీనివాస్, బొగ్గుల స్వప్న సురేష్, మామిడి శ్రీధర్, కాముని మురళి, మరికంటి కనకసేన, కప్ప మమతా సంతోష్, మాజీ జెడ్పిటిసి బొల్లారం ఎల్లయ్య, కిష్టాపూర్ మాజీ సర్పంచ్ ప్రతాప్ రెడ్డి, నాయకులు భీమప్ప, మద్ది నరేందర్ అహ్మద్, స్వామి చారి, శివకుమార్ తదితరులున్నారు

# కిశోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలి

-జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్.




**నారాయణపేట, మే.11(సమయం న్యూస్) :** జిల్లాలో మహిళా సంఘాల మాదిరిగా కిశోర (15 నుంచి 18 సంవత్సరాల లోపు) బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు.జిల్లాలోని ప్రతీ గ్రామంలో ఎంత మంది కిశోర బాలికలు ఉన్నారు ?. వారిలో ఎంత మంది సంఘాల్లో ఉన్నారు? ఇంకా ఎంత మంది సంఘాలలో చేరలేదు అనే పూర్తి సమాచారం తెలుసుకోవాలన్నారు. స్నేహ సమ్మర్ క్యాంప్ క్యాలెండర్ ను విడుదల చేశామని, ఆ క్యాలెండర్ ప్రకారం కిషోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా ఎంపీడీవోలతో సమన్వయం చేసుకుని ఎక్కువ కిశోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయించాలని జెడ్పీ సీ ఈ వో శ్రీనివాస్ రావు కు సూచించారు. స్నేహ సమ్మర్ క్యాంప్ చాలా ముఖ్యమైనదని ఆమె తెలిపారు.జిల్లాలో బాల్య వివాహాలు జరిగే మండలాలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, తాను ఆ కార్యక్రమాలకు హాజరవుతానని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో విద్యా శాఖ, వ్యవసాయ శాఖలను పర్యవేక్షణ చేశానని, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పనితీరు ఏ మాత్రం బాగా లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.సెర్ఫ్ యాక్టివిటీస్ కూడా సంతృప్తికరంగా లేవని అసహనం వ్యక్తం చేశారు. అన్నింట్లో చివరి స్థానంలో ఉందన్నారు. కొత్త డీఆర్డీవో వచ్చాక స్వయంగా తానే సమీక్ష చేస్తానని ఆమె స్పష్టం చేశారు.జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలోనూ మరిన్ని కొత్త కొత్త కార్యక్రమాలు, వ్యాపారాలకు శ్రీకారం చుట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, డిపివో సుధాకర్ రెడ్డి, డీపీ ఎం, ఏపీఎంలు, సీ సీ లు తదితరులు పాల్గొన్నారు.

# సమానత్వం పాటిద్దాం - రాజ్యాంగ విలువలను కాపాడుదాం



**సమయం న్యూస్ జగదేవపూర్ మే 11 :** అనంతసాగర్ గ్రామంలో తహసిల్దార్ ఆధ్వర్యంలో దళితుల ఆలయ ప్రవేశం జగదేవపూర్ మండలం అనంతసాగర్ గ్రామంలో గత 5రోజుల క్రితం దుర్గమ్మ బోనాల కార్యక్రమంలో దళితుల బోనాలు గుడి చుట్టు తిరగవద్దు అని కుల వివక్షత తో దూరం పెట్టిన విషయాలో ఎస్సీ ఎస్టీ కేసు నమోదు కావడం జరిగింది. ఈ విషయాన్ని తెలుసుకున్న జగదేవ్పూర్ మండల తహసిల్దార్ నిర్మల గారు అనంతసాగర్ గ్రామంలో ఎస్సీ కాలనీలో బాధితులతో మాట్లాడి గ్రామపంచాయతీలో అన్ని కులాలతో మాట్లాడి దళితులను ర్యాలీగా వెళ్లి దుర్గమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేపించి ఆలయ ప్రవేశం చేపించడం జరిగింది . ఈ సందర్భంగా తహసిల్దార్ నిర్మల మాట్లాడుతూ అన్ని కులాల వారు సమానత్వం పాటించి రాజ్యాంగ విలువలను కాపాడాలని తెలిపారు మనుషులంతా ఒకటేనని కులాల పేరుతో వివక్షత ఎవరు చూపరాదని అలా చేస్తే చట్టరీత్యా నేరం అని తెలిపారు ఇప్పటినుండి అనంతసాగర్ గ్రామంలో ఎవరు కూడా కులం పేరుతో వివక్షతను చూపవద్దని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్ఐ సత్యనారాయణ జిపిఓ శివకుమార్ అనంతసాగర్ గ్రామ సర్పంచ్ క్యాసారం కుమార్ తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ పోసాన్ పల్లి రాజు మాజీ సర్పంచ్ దండు మల్లేశం గ్రామ కార్యదర్శి విక్రమ్ గ్రామస్తులు పాల్గొనడం జరిగింది

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు లక్ష్యాలను ప్రతి శాఖ పూర్తి చేయాలి

● జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం, మే11:( సమయం న్యూస్ ):** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు లక్ష్యాలను ప్రతి శాఖ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వంపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి జిల్లా అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదుకు అధికారులు పూర్తి సహకారం అందించాలని, ప్రతి శాఖలోని ఉద్యోగులను సభ్యత్వం నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలనిసూచించారు. ప్రతి శాఖకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి సభ్యత్వ నమోదు ప్రక్రియను పర్యవేక్షించాలని, ప్రతి శాఖకు లక్ష్యాలను నిర్ధారించి వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అధికారి స్వయంగా సభ్యత్వం నమోదు చేసుకోవాలని సూచించారు.అత్యవసర సమయాల్లో రెడ్ క్రాస్ సొసైటీ సేవలు ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల నుంచి కనీసం సుమారు వెయ్యి సభ్యత్వాలు నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు. ముఖ్యంగా రెవెన్యూ, విద్య, వైద్య ఆరోగ్య, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఆర్ అండ్ బి తదితర శాఖలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. 200 మందికి పైగా ఉద్యోగులు ఉన్న శాఖలు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వాల నమోదుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా , మరియు పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు,

మహిళలపై జరుగుతున్న నేరలపై "షీ" టీమ్ పోలీసు వారి అవగాహన కార్యక్రమం




**పరిగి మండలం, మే.11(సమయం న్యూస్) :** పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని రూప్ ఖాన్ పేట దగ్గర మక్కల గోదాం లో, పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు సమక్షంలో మహిళలపై జరుగుతున్న నెరలపై వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలు:1 మహిళలపై జరుగుతున్న నేరాలు2 నిర్భయ చట్టం,గ్రాజూరా చట్టం గురించి,3 .100 డయల్, "షీ" టీమ్ నం - 181,సీసీ కెమెరాలు,4 బాల్య వివాహాలు,5 బాల కార్మిక వ్యవస్థ,6 కమ్యూనిటీ పోలీసింగ్,7 మానవ అక్రమ రవాణా,8 మద్యపాన నిషేధం,9 బ్యాంకింగ్ ఆన్లైన్ మోసాలు10 గంజాయి నిర్మూలన,11 డ్రగ్స్ నిషేధం12 సైబర్ నేరాలపై అవగాహన (నం: 1930).వివిధ అంశాలపై మక్కల గోదాం వర్కరులు మరియ "షీ" టీమ్ సభ్యులు బి.సావిత్రి,శోభ పాల్గొన్నారు.

# హరితహారం చెట్లపై కత్తి

● షాపు యజమాని చర్యలపై ఆగ్రహం



**రాయపోల్,మే 11:** మండల కేంద్రం రాయపోల్లో హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన చెట్లను ఓ షాపు యజమాని ఎదగనీయకుండా నరికివేస్తున్న ఘటన స్థానికంగా ఆగ్రహం రేకెత్తిస్తోంది. మాతా కిరణ జనరల్ స్టోర్ షాపు ముందు నాటిన చెట్లు పెరగకుండా తరచూ కొమ్మలను కత్తిరిస్తూ, చెట్ల పెరుగుదలను అడ్డుకుం టున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టిన హరితహారం కార్యక్రమం లక్ష్యాలను విస్మరిస్తూ ఇలాంటి చర్యలు కొనసాగడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.చెట్లు పూర్తిగా ఎదగకముందే నరికివేయడంతో వాటి అభివృద్ధి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి,చెట్ల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. హరితహారం చెట్లను నాశనం చేసే వారిపై గ్రామ పంచాయితీ అధికారులు, సిబ్బంది కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


## జన గణన ప్రచార వాహనాన్ని ప్రారంభించిన కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక ఐఏఎస్



**నారాయణపేట, మే.11(సమయం న్యూస్) :** జిల్లా కలెక్టరేట్ ఆవరణలో సోమవారం జిల్లా కలెక్టర్ సీ. హెచ్. ప్రియాంక జన గణన ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు.జన గణనలో భాగంగా మొదటి దశ హౌస్ లిస్టింగ్ ప్రక్రియ ఈ నెల 11వ తేదీ నుండి వచ్చే నెల 9వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లాలో జరగనుందని కలెక్టర్ తెలిపారు.ఈ గృహ గణనలో భాగంగా ఎన్యుమరేటర్లు సుమారు 33 ప్రశ్నలు అడుగుతారని, ప్రజలు సరైన సమాధానాలు చెప్పి జిల్లాలో జన గణన ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు.కాగా ఈ నెల రోజుల పాటు ప్రచార వాహనం జన గణన పై గ్రామ గ్రామాన విస్తృత ప్రచారం చేయనుంది. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, సీపీఓ కాఫువాహన్, డీపీ ఆర్వో రషీద్, ఎస్సీ కార్పొరేషన్ ఈ డీ అబ్దుల్ ఖలీల్,సీపీఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటాం

● ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్.పట్నం మహేందర్ రెడ్డి



**తాండూర్, మే.11(సమయం న్యూస్) :** ఆపదలో ఉన్న ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటాంమని శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. వివిధ రకాలుగా ఆస్పత్రి పాలై చికిత్సలు పొందిన ముగ్గురు లబ్ధిదారులకురూ.లక్ష 30 వేల సీఎం ఆర్థిక సహాయ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.తాండూరు పట్టణంలోని అక్షర కోసం రూపాయలు ఇరవై మూడు వేల సీఎం ఆర్థిక సహాయం చెక్కును తండ్రి రమేష్ కు అందించారు. అలాగే యలాల్ మండలం పగిడాల గ్రామానికి చెందిన లక్ష్మమ్మ చికిత్స కొసం భర్తకు రూ. 53 ,000 చెక్కును, బషీరాబాద్ లకు చెందిన ఆశా బేగం కుటుంబ సభ్యులకు రూ. 54,000 చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూర్ నియోజకవర్గంలో ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పాడు. అలాగే చేవెళ్ల లోని డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి జనరల్ హాస్పిటల్ లో పేదలకు ఉచిత వైద్యం చేస్తున్నట్లు వివరించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహేందర్ రెడ్డి సూచించారు.

# జిల్లాలో రెడ్ క్రాస్ సభ్యత్వాలు నమోదు చేయాలి

- రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు అధికారులను
- ఆదేశించిన-జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక ఐఏఎస్




**నారాయణపేట, మే,11(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లాలో రెడ్ క్రాస్ సభ్యత్వాలు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి హాల్లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చేస్తున్న సేవల పట్ల జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గవర్నర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికారి నాయకత్వంలో సేవలందిస్తున్నందున ప్రతి ఒక్కరూ సభ్యత్వం చేరి మరింత సేవలందించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్లు ఎస్పీ ఉపాధ్యక్షులుగా 15 మంది పాలకమండలి సభ్యులు చైర్మన్ కలిపి జిల్లాలో పలు కార్యక్రమాలు చేపట్టి అవసరం ఉన్నవారికి రెడ్ క్రాస్ సంస్థ సేవలందిస్తుందని అన్నారు. జూనియర్ రెడ్ క్రాస్ యూత్ రెడ్ క్రాస్ విభాగాలు విద్యాసంస్థలలో పలుసేవ కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. అందుకే ప్రతి ఒక్కరు సభ్యత్వం తీసుకొని ప్రజాసేవ అందించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు..

# కాంగ్రెస్ పార్టీ తోటే గ్రామాల అభివృద్ధి

- గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య
- నాగ్వార్ లో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం



**రాయికోడు, మే11 . సమయం న్యూస్** అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం ఏనలేని కృషి చేస్తుం దని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య స్పష్టం చేశారు.సోమవారం మండల పరిధిలోని నాగ్వార్ గ్రామంలో సర్పంచ్ స్వామిదాస్, ప్రజా ప్రతినిధులతో కలిసి నాయి బ్రాహ్మణ అనసూయ రాములు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయం, బడుగు బలహీన వర్గాల సంక్షేమ రంగానికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు.రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ రైకోడ్ మండల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించి అన్ని విధాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియారు. నాగ్వార్ గ్రామంలో 32 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించగా 10 వరకు పూర్తయ్యాయని మిగతా 22 ఇళ్ల నిర్మాణం నెలలోపు పూర్తి అవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ లక్ష్మణ్, ఎంపీడీవో ఎంఎస్ షరీఫ్, ఏఈ దేవయ్య, ఏపీవో రమేష్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బసవరాజ్ పటేల్,యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఏ ప్రభాకర్, సర్పంచ్ లపోరం మాజీ అధ్యక్షులు సతీష్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ నాగిశెట్టి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జి విట్టల్ పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్ తో పాటు నాయకులు జ్ఞానేశ్వర్, ఏ నరేష్, వెంకటరెడ్డి, ఉప్పరి పండరి, మహంకాళి, ఎండి మక్సుద్, మారుతి రావు, నాగయ్య, శ్రీనివాస్, పండరి, పలువురు నాయకులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పిప్పడపల్లి గ్రామంలో మెతడిస్ట్ సంఘం ఆధ్వర్యంలో సువార్త కూడికల పత్రిక ఆవిష్కరణ



**సంగారెడ్డి జిల్లా రాయికోడ్ సమయం న్యూస్ మే 11** రాయికోడ్ మండలం పీపడ్ పల్లి గ్రామంలో రక్షణ కుటుంబాల ఆశీర్వాద సువార్త కుడికల పత్రిక ఆవిష్కరణ ఘనంగా పీపడ్ పల్లి గ్రామంలోని మెథడిస్ట్ చర్చిలో మే నెల 23, 24 తేదీలలో నిర్వహించబడును రక్షణ కుటుంబాల ఆశీర్వాద సువార్త కుడికల కార్యక్రమానికి సంబంధించి గోడపత్రికలు మరియు కరపత్రాలను ఘనంగా ఆవిష్కరించడం జరిగిందిఈ కార్యక్రమం స్థానిక సంఘకాపరి పాస్టర్ రవీందర్ గారు,పాస్టర్ సంజీవ్ గారు,లెమన్ యం. ప్రభాకర్, స్టార్ యూత్ ప్రెసిడెంట్ యమ్ రాజ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ యార్రొల అనిల్ కుమార్ మరియు సంఘ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ కుడికల ద్వారా విశ్వాసం, ప్రేమ మరియు ఆత్మీయత పెంపొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సొన్నయిల దుర్గప్ప, యం,సంజీవ్, యం,విజయ్, జె.కిష్టప్ప ఏర్రోల రాజు, ఏర్రోల సుదర్శన్, యం.పౌలు,యం .మోహన్, , జనొల్ల అనిల్ కుమార్, దేవదానం, ప్రశాంత్, యం. సునీల్ ,యం.సుమన్,యం. శ్రీను, మధుకర్, జె.మాణిక్యం , యర్రొల సునీల్,తదితరులు పాల్గొన్నారు.అలాగే రాయికోడ్ మండలంలోని వివిధ గ్రామాల భక్తులకు ఈ కుడికలకు ఆహ్వానం పలుకుతూ, ఈ ఆధ్యాత్మిక సమావేశం ద్వారా ప్రతి కుటుంబం దేవుని ఆశీర్వాదాలు పొందాలని ప్రార్థన చేయటం జరిగింది.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- నిజమైన ఓటరు ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలి
- రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలి
- తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి





**నారాయణపేట, మే,11(సమయం న్యూస్) :** ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా తాజా ఓటరు జాబితాను ఎస్ఐఆర్ జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు .సోమవారం తెలంగాణ చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి నారాయణపేట జిల్లా నుంచి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రియాంక హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో రాబోయే 15 రోజుల్లో కనీసం 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. స్టేషన్ ఘన్‌పూర్, అశ్వారావుపేట వంటి నియోజకవర్గాలు ఇప్పటికే 80 శాతానికి పైగా మ్యాపింగ్ పూర్తి చేశాయని తెలిపారు. ఒడిశా రాష్ట్రం ఇప్పటికే 90 శాతం, కర్ణాటక 81 శాతం, మహారాష్ట్ర 68 శాతం మ్యాపింగ్ పూర్తి చేశాయని, తెలంగాణ ఇంకా వెనుకబడి ఉందని పేర్కొన్నారు.జిల్లా ఎన్నికల అధికారులు తమ బృందాలను ప్రోత్సహించి మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర కేవలం ఇళ్ల గుర్తింపు, వ్యక్తుల గుర్తింపుకు మాత్రమే పరిమితం కావాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు ఎస్ఐఆర్ మ్యాపింగ్ నిర్వహిస్తున్నారనే భావన ప్రజల్లో కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను అన్ని వనరుల నుంచి గుర్తించి నియమించుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రారంభమైన తర్వాత ప్రతిరోజూ ఫారాల పంపిణీ, సేకరణపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.ప్రజలకు తమ ప్రాంతంలోని బీఎల్ఓ ఎవరో తెలిసేలా చర్యలు తీసుకోవాలని, నిజమైన ఓటరు తన ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని ఆదేశించారు.మ్యాపింగ్ పురోగతిని పెంచేందుకు రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళల సహకారాన్ని కూడా వినియోగించుకోవాలని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బీఎల్ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలకు అనుగుణంగా మ్యాపింగ్ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించి నియమిస్తున్నామని, రాజకీయ పార్టీలతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా ప్రక్రియ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి అర్హ ఓటరు పేరు సక్రమంగా మ్యాపింగ్ అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ ఫణీంద్ర

# సమతుల్య ఎరువుల వినియోగం, రైతు రిజిస్ట్రీ, ఆయిల్‌పామ్ అంశాలపై నిగ్రాని సమితుల పై కలెక్టరేట్ లో సమావేశం



**నారాయణపేట, మే,11(సమయం న్యూస్) :** వ్యవసాయంలో సమతుల్య ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం, అధిక రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడం, నేల ఆరోగ్య పరిరక్షణ (ధర్తీ మాతా బచావో) మరియు రైతులకు అవగాహన కల్పించేందుకు నిగ్రాని సమితుల (Nigrani Samithis) ఏర్పాటు చేయబడినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కమిటీల నిర్మాణం, బాధ్యతలు మరియు కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ప్రతి 15 రోజులకొకసారి గ్రామ స్థాయిలో అవగాహన సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. రైతులకు సమతుల్య ఎరువుల వినియోగం, నేల ఆరోగ్యం, సేంద్రియ మరియు సహజ వ్యవసాయం, అధిక యూరియా వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించనున్నారు.గ్రామ స్థాయి నిగ్రాని సమితిగ్రామ స్థాయిలో సర్పంచ్, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ), ప్రోగ్రెసివ్ రైతులు, ఫీూా డైరెక్టర్లు, కృషి సఖులు, పంచాయతీ కార్యదర్శులతో కమిటీ ఏర్పాటు చేయబడుతుంది. ఈ కమిటీ గ్రామంలో ఎరువుల వినియోగాన్ని పర్యవేక్షిస్తూ రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది.మండల స్థాయి కమిటీతహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి, ఎరువుల డీలర్లు మరియు సంబంధిత శాఖల అధికారులతో మండల స్థాయి కమిటీ ఏర్పాటు చేయబడుతుంది. ఈ కమిటీ ఎరువుల సరఫరా, నిల్వలు మరియు గ్రామ స్థాయి కార్యక్రమాల అమలును సమీక్షిస్తుంది.డివిజనల్ స్థాయి కమిటీ ఆర్డీఓ,ఏడీఏ మరియు ఇతర శాఖల అధికారులతో డివిజనల్ కమిటీ ఏర్పాటు చేయబడుతుంది. ఈ కమిటీ అవగాహన కార్యక్రమాల పురోగతి మరియు ఎరువుల వినియోగ నియంత్రణపై పర్యవేక్షణ చేస్తుంది.జిల్లా స్థాయి కమిటీజిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఐఆూా, ఎరువుల కంపెనీ ప్రతినిధులు మరియు సంబంధిత శాఖల అధికారులతో జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేయబడుతుంది. ఈ కమిటీ జిల్లాలో ఎరువుల వినియోగ ధోరణి, సరఫరా పరిస్థితి మరియు శాఖల సమన్వయాన్ని పర్యవేక్షిస్తుంది. సమావేశంలో రైతు రిజిస్ట్రీ పురోగతిని కూడా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న రైతుల నమోదును వేగవంతం చేయాలని, ముఖ్యంగా తప్పు మొబైల్ నంబర్లు, అందుబాటులో లేని రైతులు మరియు వలస రైతుల వివరాల సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.అదేవిధంగా ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, మొక్కల పంపిణీ, నీటి నిర్వహణ మరియు రైతుల ఆదాయం పెంపుపై చర్చించారు. ఆయిల్‌పామ్ సాగుపై గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి చి. ప్రియాంక, జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, ఐఆూా సాయిబాబా, వ్యవసాయ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారులు, ఆయిల్‌ఫెడ్ అధికారులు, ఎరువుల డీలర్లు మరియు ఎరువుల కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం, నేల ఆరోగ్యాన్ని పరిరక్షించడం మరియు రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించడంలో నిగ్రాని సమితులు కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు తెలిపారు. ధన్యవాదాలు.

# బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలి.

- కోస్గి సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) సైదులు.
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



**మద్దూర్ మున్సిపల్,(మం)11(సమయం న్యూస్) :** బక్రీద్ పండుగ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ,అక్రమ పశువుల రవాణా నియంత్రణ, శాంతియుతంగా పండుగ జరుపుకోవాలని మద్దూర్ పోలీసు స్టేషన్ లో ఖురేషి (స్లాటర్ హౌస్ నిర్వాహకులు) హిందూ, ముస్లిం మత పెద్దల లతో కోస్గి సిఐ సైదులు,ఎస్సై విజయ్ కుమార్ శాంతి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ....బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. పశువుల కొనుగోలు, రవాణా,వధ ప్రక్రియల్లో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు,కోర్టు మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.రవాణా సమయంలో జంతువులకు సరైన సంరక్షణ కల్పిస్తూ మానవత్వంతో వ్యవహరించాలని, వాహనాల్లో అధిక సంఖ్యలో పశువులను ఎక్కించరాదని సూచించారు.గోవుల రవాణా చేసే సమయంలో ఎవరికైనా ఎలాంటి సమాచారం ఉన్న వెంటనే లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని, చట్టాన్ని చేతిలోకి తీసుకోరాదని సూచించారు.వాహనాల తనిఖీల సమయంలో చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా నకిలీ లేదా చెల్లని వెటర్నరీ సర్టిఫికెట్లు ఉపయోగించరాదని హెచ్చరించారు.అనుమతి లేని ప్రదేశాల్లో జంతువుల వధ,బహిరంగ ప్రదేశాల్లో మాంసం విక్రయాలు,ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా వ్యవహరించడం, సోషల్ మీడియాలో మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే పోస్టులు,వీడియోలు, ఫోటోలు షేర్ చేయడం వంటి చర్యలు చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు.అక్రమంగా పశువుల రవాణా,నిషేధిత జంతువుల వధ, అనుమతులు లేకుండా స్లాటర్ హౌస్ నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పండుగ సమయంలో ప్రజల మనోభావాలను గౌరవిస్తూ సామరస్య వాతావరణం నెలకొనేలా వ్యవహరించాలని ఖురేషి నిర్వాహకులకు సూచించారు.పరిశుభ్రత,పారిశుద్ధ్య ప్రమాణాలు పాటించడంతో పాటు వ్యర్థాలను సరైన విధంగా నిర్వహించాలని సూచించారు.నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి కార్యకలాపాలను ఉపేక్షించబోమని సీఐ తెలిపారు. ఎస్ఐ రేవతి, వెటర్నరీ డాక్టర్ విశాల, హిందూ ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ప్రారంభమైన విద్యా వారోత్సవాలు

- విద్యా వారోత్సవాల బ్రోచర్ విడుదల చేసిన....
- ప్రిన్సిపాల్ డా.బి.శ్రీనివాస్ రెడ్డి,కొడంగల్ ఎస్సై జి.వి సత్యనారాయణ



**కొడంగల్ మున్సిపల్,11(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ ప్రభుత్వ డీగ్రీ కళాశాల, లో ఈ నెల 11 నుండి 17 వరకు తలపెట్టిన విద్యా వారోత్సవాల్ని సోమవారం ఘనంగా ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కొడంగల్ పట్టణ ఎస్సై జి. వి. సత్యనారాయణ .సోమవారం ముఖ్యంగా కార్యక్రమ ప్రారంభోత్సవం, బ్రోచర్ విడుదల, సైబర్ నేరాలపై అవగాహన, మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారం, ర్యాగింగ్ నిరోధక నిబంధనలు మరియు పోస్టర్ ప్రదర్శన, అడ్మిషన్లకై ఇంటింటి ప్రచారం మరియు ప్రభుత్వ పథకాల గూర్చి ప్రజలకు అవగాహన కల్పించడం వంటి పలు కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. సామాజిక భాగస్వామ్యం ప్రధాన లక్ష్యంగా కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మనిషిని వెలుగులోకి తెచ్చేదే విద్య అని, అజ్ఞానం, అసమానతలు, అంటరానితనం, మూఢ నమ్మకాలు వంటి సామాజిక రుగ్మతలను తొలగించి సమసమాజ నిర్మాణ స్థాపనకు విద్య ఏకైక సాధనమన్నారు. ఈ కార్యక్రమం కళాశాల అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఎస్సై జి. వి. సత్య నారాయణ ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక ఒక వినూత్న కార్యక్రమమని విద్యార్థులు డ్రగ్స్ మరియు ర్యాగింగ్ జోలికి వెళ్ళవద్దన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఫియా ఖానం, ఐ. క్యూ. ఎ. సి కోఆర్డినేటర్ టి. రాంబాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. ఆర్. శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ బి.యాదగిరి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## మెక్సికో ఇంటర్నేషనల్ ఛాలెంజ్‌లో కృష్ణ ప్రసాద్--పృథ్వీ రాయ్ జోడీకి స్వర్ణం

**హైదరాబాద్, క్రీడప్రతినిధి, మే 11:**మెక్సికోలోని ఆగ్వాస్కలియెంటెస్‌లో మే 5 నుంచి నేటి వరకు జరిగిన మెక్సికో ఇంటర్నేషనల్ ఛాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు గారుగ కృష్ణ ప్రసాద్ -- పృథ్వీ రాయ్ జోడీ స్వర్ణ పతకం కైవసం చేసుకుంది.పురుషుల డబుల్స్ ఫైనల్లో కెనడాకు చెందిన ల్యారీ పొంగ్ -- ల్యారీ పొంగ్ జోడీపై కృష్ణ ప్రసాద్--పృథ్వీ రాయి జంట అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఉత్కంఠభరితంగా సాగిన తుదిపోరులో 21-18, 21-19 తేడాతో వరుస సెట్లలో విజయం సాధించి టైటిల్‌ను సొంతం చేసుకుంది.టోర్నమెంట్ మొత్తం నిలకడైన ఆటతీరుతో ఆకట్టుకున్న ఈ భారత జోడీ, వేగవంతమైన స్మాష్‌లు, సమన్వయంతో కూడిన ఆటతో ప్రత్యర్థులను ఒత్తిడికి గురిచేసింది. కీలక సమయాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచి పాయింట్లు సాధించడం వారి విజయానికి ప్రధాన బలంగా నిలిచింది. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించే సామర్థ్యం ఈ జోడీకి ఉందని క్రీడా నిపుణులు ప్రశంసిస్తున్నారు.ఈ విజయంతో అంతర్జాతీయ వేదికపై మరోసారి భారత బ్యాడ్మింటన్ ప్రతిభ చాటుకోగా, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




## ఫింగర్ ప్రింట్ డివైస్ తో తనిఖీలు

- ఎస్సై వెంకటేశ్వర్లు...జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు



**నారాయణపేట, మే,11(సమయం న్యూస్):** నారాయణపేట జిల్లా కేంద్రంలో ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా దొంగతనాల నివారణనే లక్ష్యంగా, అనుమానిత వ్యక్తులను మరియు పాత నేరస్తులను గుర్తించడానికి బ్లూ కోర్ట్స్ పోలీసులు రవి, సంతోష్ లు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు .సోమవారం నారాయణపేట బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలలో, బ్యాంకుల వద్ద నారాయణపేట పోలీసులు అకస్మికంగా ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు నిర్వహించడం జరిగింది. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తగిన రీతిలో పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్ తో వ్యక్తుల వేలిముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరి పోల్చారు.పౌరులు ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే లోకల్ పోలీసులకు లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని ఎస్సై ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## రాయికోడ్ మండల ఎరుకల సంఘం అధ్యక్షుడు ఏకగ్రీవంగా ఎన్నిక



**రాయికోడ్ సమయం న్యూస్ మే 11** రాయికోడ్ మండల ఎరుకల సంఘం అధ్యక్షుడు - సంగాపూర్ ఎస్ అంజయ్య

మండల ప్రధాన కార్యదర్శి - రాయికోడ్ నర్సింలు
మండల యువ అధ్యక్షుడు - సంగాపూర్ ప్రశాంత్
మండల యువ ప్రధాన కార్యదర్శి - రాయికోడ్ లక్ష్మణ్
మండల ఉపాధ్యక్షుడు - సంగాపూర్ యాదయ్య
మండల యువ ఉపాధ్యక్షుడు - సంగాపూర్ ఎం అంజయ్య
మండల ఉపాధ్యక్షుడు - రాయికోడ్ శ్రీకాంత్, ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మరియు కార్యవర్గం సభ్యులు కలిసి రాయికోడ్ మండలంలో నూతనంగా అధ్యక్షుని ఉపాధ్యక్షుడు యూత్ అధ్యక్షులను ఎన్నుకోవడం జరిగింది అందరూ కలిసికట్టుగా ఉండాలని వారు అన్నారు

## జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి మిషన్ భగీరథ నీటి సరఫరా మెరుగు పరచాలి

-జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్.



**నారాయణపేట, మే,11(సమయం న్యూస్) :** జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి/మెడికల్ కళాశాలలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం మిషన్ భగీరథ నీటి సరఫరాను మరింత పెంచి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, హెచ్ఓడీ లతో మెడికల్ కాలేజీ/ జిల్లా ఆస్పతి నీటి సమస్యపై కలెక్టర్ చర్చించారు. ప్రస్తుతం ఆస్పత్రికి చేస్తున్న నీటి సరఫరాతో పాటు అదనంగా పెంచి సరఫరా చేయాలని కలెక్టర్ మిషన్ భగీరథ గ్రిడ్ ఈ.ఈ శ్రీనివాస్ కు సూచించారు. నాలుగైదు రోజులలో ఆస్పత్రికి అదనంగా నీటిని సరఫరా చేస్తామని ఈ ఈ కలెక్టర్ కు తెలిపారు.మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, జిల్లా ఆస్పత్రి హెచ్ఓడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## గ్రామ దేవత శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి అభిషేక మహోత్సవాన్ని




**రాయికోడ్ సమయం న్యూస్ మే 11** రాయికోడ్ మండలం నల్లంపల్లి గ్రామంలో గ్రామ దేవత శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి అభిషేక మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహి ంచనున్నారు. మే 12, 2026 మంగళవారం ఉదయం 9:30 గంటలకు జరిగే ఈ పవిత్ర కార్యక్రమానికి గ్రామంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎర్రే గొల్ల కృష్ణ యాదవ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, గ్రామ సుభిక్షం కోసం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామంలో శాంతి, ఐక్యత, పంటల సమృద్ధి నెలకొనాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. గ్రామంలోని చిన్నా పెద్దలు, మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దీవెనలు పొందాలని నిర్వాహకులు మనస్ఫూర్తిగా ఆహ్వానించారు.

## బండి సంజయ్ కుమారుడు భాగీరత్ ను వెంటనే రెస్ట్ చేయాలి.



**రాయికోడ్ సమయం న్యూస్ మే 11** బండి సంజయ్ కుమారడు బండి సాయి భగీరత్ ను వెంటనే అరెస్టు చేయాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, కార్యదర్శి చేవెల్ విట్టల్,కొల్లూరు శంకర్ రాయికోడ్ గ్రామ సర్పంచ్ రాధా తుకారం డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రమైన రాయికోడ్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ... కేంద్ర మంత్రి పదవిలో ఉండడంతో తన కుమారుని అరెస్టు చేయడంలో తప్పిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో సామాన్యులకు ఒక రకమైనటువంటి న్యాయం,రాజకీయ పదవుల్లో ఉన్నటువంటి వారికి ఒక రకమైనటువంటి న్యాయం జరుగుతుందని అన్నారు. బాధితురాలికి న్యాయం జరగాలని వారు అన్నారు. తప్పు చేసిన ఎలాంటి వ్యక్తికైనా చట్టపరమైనటువంటి శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బాలికలకు రక్షణ కరువైందని అన్నారు. వేదికల మీద బాలికలు, ఆడవారు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఉపన్యాసాలు ఇవ్వడం కాదు. తప్పు చేసిన ఎంతటి వారినైనా శిక్షించాలని వారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంగమేశ్వర్, గ్రామ ఉపసర్పంచ్ శివకుమార్ ,మాజీ ఉప సర్పంచ్ రాములు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వలపై దాడి

- 200 క్వింటాళ్ల స్వాధీనం... నిందితుడిపై కేసు నమోదు



**రాయపోల్, మే 11:**పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన ఘటనలో విజిలెన్స్ అండ్ టాస్క్ ఫోర్స్ డిఎస్పి వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో సంయుక్తంగా దాడి చేసి భారీగా బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం మధ్యాహ్నం 1 గంటల సమయంలో సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలోని సాయి వీరభద్ర రైస్ మిల్‌పై ఈటీఎఫ్ బృందం, సరఫరా శాఖ అధికారులు, రాయపోల్ పోలీసులు కలిసి ఆకస్మిక దాడి నిర్వహించారు.దాడిలో సుమారు 200 క్వింటాళ్లకు పైగా పిడిఎస్ బియ్యం (ఎఫ్ఆర్‌కే కర్నల్స్‌తో కలిపిన సన్నబియ్యం)ను గుర్తించారు. మొత్తం 137 గన్నీ సంచులు, 341 మల్టీకలర్ ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ ఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.సిద్ధిపేట ఏసీఎస్ఓ సాయి రవి పంచనామా నిర్వహించి, మిల్ యజమాని రత్నాకర్‌పై కేసు నమోదు చేశారు. కాగా రత్నాకర్‌పై గతంలో కూడా వివిధ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

**నిందితుడిపై ఉన్న కేసులు:**

బచ్చన్నపేట పీఎస్‌లో Cr.No.114/2021
రఘునాథపల్లి పీఎస్‌లో Cr.No288/2021
రాయపోల్ పీఎస్‌లో Cr.No123/2024
రాయపోల్ పీఎస్‌లో Cr.No134/2024 (రూ. 29.19 కోట్ల వరి మళ్లింపు కేసు)
రాయపోల్ పీఎస్‌లో Cr.No10/2026
రాయపోల్ పీఎస్‌లో Cr.No40/2026
రాయపోల్ పీఎస్‌లో Cr.No46/2026
రాయపోల్ పీఎస్‌లో Cr.No16/2025 (ఈ కేసులో ఆయన భార్య బి. శ్రావంతి కూడా నిందితురాలు)ఈ దాడిలో ఈటీఎఫ్-2 డీఎస్పీ వెంకటేశం, సీఐ బి. పాండరీ, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిద్ధిపేట ఏసీఎస్ఓ సాయి రవి, రాయపోల్ ఎస్‌హెచ్‌ఓ కే. మానస తదితరులు పాల్గొన్నారు.

### తాండూర్ మున్సిపల్ పరిధిలో జన గణన-2027 ను ప్రారంభించిన...తాండూర్ మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి



**తాండూర్ మున్సిపల్, మే,11(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం జన గణన - 2027 ను తాండూర్ మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. పట్టణంలోని గాంధీ చౌక్ సమీపంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. మ్యాపింగ్, నెంబర్ రింగ్ చేసే విధానాన్ని ఎనీ మారేటర్ ని అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్ అభివృద్ధి కోసం జనాభా గణన లో భాగంగా ఇండ్ల వివరాలు, సౌకర్యాలకు సంబంధించి పకడ్బందీగా చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ నరేందర్ రెడ్డి, సూపర్వైజర్ అనిల్ కుమార్, వార్డ్ కౌన్సిలర్, బిల్ కలెక్టర్, వార్డ్ ఆఫీసర్లు ఉన్నారు.

## తొట్టెల కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు




**రాయికోడ్ సమయం న్యూస్ మే 11** రాయికోడ్ చౌరస్తలో ప్రవేట్ ఫంక్షన్ హాల్లో రాజశేఖర్ చౌదరి గారి కూతురు తోటల కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు సతీష్ వివిధ గ్రామాల సర్పంచులు ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు




# ఐపీఎల్ ఫ్రాంచైజీ ఓనర్లకు బీసీసీఐ హెచ్చరిక

ముంబై, మే 11 : ఐపీఎల్ 2026 సీజన్ ఉత్కంఠభరితంగా కొనసాగుతున్న వేళ, ఫ్రాంచైజీ యజమానుల వ్యవహారశైలిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి అసంతృప్తి వ్యక్తం చేసింది. బోర్డు జారీ చేసిన నిబంధనలను కొందరు జట్టు యజమానులు పట్టించుకోవడం లేదని గుర్తించిన బీసీసీఐ, ఇకపై రూల్స్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఇటీవల అన్ని ఐపీఎల్ ఫ్రాంచైజీలకు ప్రత్యేక మార్గదర్శకాలు పంపించారు. మ్యాచ్ జరుగుతున్న సమయంలో జట్టు యజమానులు ప్లేయింగ్ ఏరియాలోకి రావద్దని, ఆటగాళ్లు లేదా సపోర్ట్ స్టాఫ్‌తో ప్రత్యక్షంగా మాట్లాడకూడదని స్పష్టంగా ఆదేశించారు. అయితే కొందరు యజమానులు ఈ నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు బోర్డు గుర్తించింది. ఐపీఎల్‌కు చెందిన ఓ అధికారి మాట్లాడుతూ.. "ఫ్రాంచైజీ ఓనర్లకు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశాం. కొందరు డగౌట్ సమీపంలో తిరుగుతూ కనిపించారు. మరికొందరు మొబైల్ ఫోన్లతో మైదానంలోకి వచ్చి ఫొటోలు కూడా తీశారు. దీనికి సంబంధించిన ఆధారాలు మా వద్ద ఉన్నాయి. పలుమార్లు హెచ్చరించినా మార్పు కనిపించకపోవడంతో ఇకపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుంది" అని తెలిపారు. ఇక మరోవైపు ఐపీఎల్ 2026 సీజన్‌లో 'హనీ ట్రాప్' ప్రమాదాలపై కూడా బీసీసీఐ అన్ని ఫ్రాంచైజీలను అప్రమత్తం చేసింది. ఆటగాళ్లు లేదా అధికారులపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించింది. హై ప్రొఫైల్ క్రీడా వాతావరణాల్లో ఇలాంటి ప్రమాదాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసిన బీసీసీఐ, హోటళ్లలో తనిఖీలు కూడా నిర్వహిస్తోంది. ఆటగాళ్ల గదుల్లోకి అనుమతి లేని వ్యక్తులు ప్రవేశించినట్లు తేలితే కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని బోర్డు హెచ్చరించింది.



# వినేశ్ ఫొగట్ వివాదం మళ్లీ హాట్‌టాపిక్

**అయోధ్య, మే 11 :** భారత మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగట్‌కు సంబంధించిన వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది. జాతీయ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నీలో పాల్గొనేందుకు ఆమె అయోధ్యకు చేరుకున్నప్పటికీ, భారత రెజ్లింగ్ సమాఖ్య నుంచి అనుమతి లభించలేదు. రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత మళ్లీ పోటీల్లో పాల్గొనాలంటే కనీసం ఆరు నెలల విరామం ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. ఈ నియమం ప్రకారం వినేశ్ ప్రస్తుతం అర్హురాలు కాదని భారత రెజ్లింగ్ సమాఖ్య స్పష్టం చేసింది. జూన్ 26 వరకు దేశీయ టోర్నీల్లో ఆమె పాల్గొనలేరని గతంలోనే షోకాజ్ నోటీసు కూడా జారీ చేసింది. అయితే తాను తిరిగి పోటీల్లో పాల్గొనేందుకు అర్హురాలినేనని వినేశ్ ఫొగట్ పేర్కొంది. ప్రపంచ యాంటీ డోపింగ్ సంస్థ నిబంధనల ప్రకారం యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్‌కు ముందుగానే తన రీఎంట్రీ విషయాన్ని తెలియజేశానని ఆమె వెల్లడించింది. గత జూన్‌లోనే ఈ సమాచారం అందించినట్లు తెలిపింది. రిటైర్మెంట్ తర్వాత తిరిగి బరిలోకి దిగాలనుకునే క్రీడాకారులు కనీసం ఆరు నెలల ముందే సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని నిబంధనలు చెబుతున్నాయి. అయితే వినేశ్ ఇచ్చిన వివరణతో రెజ్లింగ్ సమాఖ్య సంతృప్తి చెందలేదు. అర్హత అంశంపై మాత్రమే ఆమె స్పందించిందని, క్రమశిక్షణా చర్యలపై సరైన వివరణ ఇవ్వలేదని సమాఖ్య పేర్కొంది. జాతీయ టోర్నీలో పాల్గొనే మహిళా రెజ్లర్లకు సోమవారం సాయంత్రం వెయిట్ చెకింగ్ నిర్వహించనున్నారు. మంగళవారం పోటీలు జరగనున్నాయి. ఈ టోర్నీలో విజేతలుగా నిలిచిన వారికి ప్రపంచ చాంపియన్‌షిప్ ట్రయల్స్‌లో పాల్గొనే అవకాశం లభించనుంది.

# పరుగుల సునామీలో ఢిల్లీదే గెలుపు!





**అక్షర్, మిల్లర్ మెరుపులు.. పంజాబ్‌పై 3 వికెట్ల తేడాతో విజయం**

**ఒకే ఓవర్ మిగిలి ఉండగానే 211 పరుగుల భారీ లక్ష్య ఛేదన**

**శ్రేయస్ అయ్యర్, ప్రియాంశ్ ఆర్యల అర్ధశతకాలు వృథా**

**ధర్మశాల :** ఐ పీ ఎల్ లో భాగంగా సోమవారం ధర్మశాలలోని హెచ్ పీ సీ ఏ (హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్) స్టేడియం వేదికగా జరిగిన హైస్కోరింగ్ థ్రిల్లర్ లో పంజాబ్ కింగ్స్ పై ఢిల్లీ క్యాపిటల్స్ (డీ సీ) అద్భుత విజయం సాధించింది. పంజాబ్ నిర్దేశించిన 211 పరుగుల భారీ లక్ష్యాన్ని ఢిల్లీ బ్యాటర్లు సమష్టిగా పోరాడి మరో 6 బంతులు (ఒక ఓవర్) మిగిలి ఉండగానే 7 వికెట్లు కోల్పోయి 216 పరుగులు సాధించి ఘనవిజయాన్ని అందుకున్నారు. ఆల్ రౌండర్ అక్షర్ పటేల్, డేవిడ్ మిల్లర్ ల విధ్వంసక అర్ధశతకాలతో పాటు చివర్లో అశుతోష్ శర్మ మెరుపులు ఢిల్లీకి అద్భుత గెలుపును అందించాయి. ఈ పరాజయంతో తొలుత బ్యాటింగ్ లో అదరగొట్టిన పంజాబ్ కింగ్స్ కు తీవ్ర నిరాశే మిగిలింది. ముఖ్యంగా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, యువ ఓపెనర్ ప్రియాంశ్ ఆర్యల అద్భుత ఇన్నింగ్స్ లు వృథా అయ్యాయి.

## శ్రేయస్, ప్రియాంశ్ జోరు.. పంజాబ్ భారీ స్కోరు..

టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో మొదట బ్యాటింగ్ కు దిగిన పంజాబ్ కింగ్స్ బ్యాటర్లు ఆరంభం నుంచే ఢిల్లీ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య క్రీజులో ఉన్నంతసేపు బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 33 బంతుల్లోనే 56 పరుగులు సాధించి ఇన్నింగ్స్ కు గట్టి పునాది వేశాడు. అతనికి తోడుగా క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. వీలుచిక్కినప్పుడల్లా భారీ షాట్లు ఆడుతూ స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. అయ్యర్ 36 బంతుల్లోనే అజేయంగా 59 పరుగులు సాధించి ఇన్నింగ్స్ కు వెన్నెముకలా నిలిచాడు. వీరికి తోడుగా కూపర్ కొన్నోల్లీ 27 బంతుల్లో 38 పరుగులు సాధించి అద్భుత సహకారం అందించాడు. దీంతో పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 210 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో మాధవ్ తివారీ 40 పరుగులిచ్చి 2 వికెట్లు, మిచెల్ స్టార్క్ 57 పరుగులిచ్చి 2 వికెట్లు, ముకేష్ కుమార్ 31 పరుగులిచ్చి 1 వికెట్ తీశారు. స్టార్క్ భారీగా పరుగులు సమర్పించుకోవడం ఢిల్లీకి ప్రతికూలంగా మారింది.

## అక్షర్, మిల్లర్ విధ్వంసం.. లక్ష్య ఛేదన..

211 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ కు ఆరంభంలోనే పంజాబ్ బౌలర్లు సవాలు విసిరారు. పంజాబ్ పేసర్ అర్ష్ దీప్ సింగ్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి 21 పరుగులిచ్చి 2 వికెట్లు తీయగా, యశ్ ఠాకూర్ 55 పరుగులిచ్చి 2 వికెట్లు, మార్కస్ స్టోయినిస్ 44 పరుగులిచ్చి 1 వికెట్ పడగొట్టారు. వికెట్లు పడుతున్నా ఢిల్లీ బ్యాటర్లు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ముఖ్యంగా ఆల్ రౌండర్ అక్షర్ పటేల్, డేవిడ్ మిల్లర్ లు క్రీజులో కుదురుకుని పంజాబ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. మైదానం నలుమూలలా సిక్సర్లు, ఫోర్లు బాదుతూ లక్ష్యాన్ని కరిగించారు. అక్షర్ పటేల్ 30 బంతుల్లోనే 56 పరుగులు సాధించగా, డేవిడ్ మిల్లర్ కేవలం 28 బంతుల్లోనే 51 పరుగులు చేసి మ్యాచ్ ను ఢిల్లీ వైపు తిప్పారు. వీరిద్దరూ అవుటైన తర్వాత మ్యాచ్ కాస్త ఉత్కంఠగా మారినప్పటికీ.. చివర్లో క్రీజులోకి వచ్చిన అశుతోష్ శర్మ కేవలం 10 బంతుల్లోనే 24 పరుగులు బాది పంజాబ్ ఆశలపై నీళ్లు చల్లాడు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ 19 ఓవర్లలోనే 7 వికెట్లు కోల్పోయి 216 పరుగులు సాధించి, మరో 6 బంతులు మిగిలి ఉండగానే 3 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది.







# వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్ అగ్రస్థానం

**దుబాయ్, మే 11 :** అంతర్జాతీయ క్రికెట్ మండలి విడుదల చేసిన తాజా వన్డే వార్షిక ర్యాంకింగ్స్‌లో భారత జట్టు మరోసారి అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. 118 రేటింగ్ పాయింట్లతో టీమిండియా మొదటి స్థానంలో కొనసాగుతూ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఇప్పటికే టీ20 ర్యాంకింగ్స్‌లోనూ అగ్రస్థానంలో ఉన్న భారత్, వన్డే ఫార్మాట్‌లోనూ తన జోరు కొనసాగిస్తోంది. టీ20 ప్రపంచకప్ 2026లో విజయం సాధించిన అనంతరం భారత జట్టు పొట్టి ఫార్మాట్‌లో ఆధిపత్యాన్ని ప్రదర్శించగా, 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో ఘన విజయం సాధించడం ద్వారా వన్డేల్లోనూ తన బలాన్ని నిరూపించింది. తాజా ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ 113 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. భారత్‌తో కేవలం ఐదు పాయింట్ల తేడా మాత్రమే ఉండటం విశేషం. 109 పాయింట్లతో ఆస్ట్రేలియా మూడో స్థానంలో కొనసాగుతోంది. ఇటీవల అద్భుత ప్రదర్శనలతో వరుస విజయాలు నమోదు చేసిన దక్షిణాఫ్రికా 102 పాయింట్లతో నాలుగో స్థానానికి ఎగబాకింది. ఈ క్రమంలో పాకిస్థాన్‌ను వెనక్కి నెట్టింది. పాకిస్థాన్ ప్రస్తుతం 98 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో శ్రీలంక 96 పాయింట్లతో ఆరో స్థానంలో, అఫ్గానిస్థాన్ 93 పాయింట్లతో ఏడో స్థానంలో కొనసాగుతున్నాయి. ఇంగ్లండ్ 89, బంగ్లాదేశ్ 84, వెస్టిండీస్ 74 పాయింట్లతో టాప్–10లో తమ స్థానాలను నిలబెట్టుకున్నాయి. ఇక ఐర్లాండ్ 54




పాయింట్లతో 11వ స్థానానికి చేరి జింబాబ్వేను వెనక్కి నెట్టింది. జింబాబ్వే 53 పాయింట్లతో 12వ స్థానానికి పడిపోయింది. అమెరికా 46 పాయింట్లతో 13వ స్థానానికి ఎగబాకగా, స్కాట్లాండ్ 44 పాయింట్లతో 14వ స్థానంలో నిలిచింది. ఐసీసీ నిబంధనల ప్రకారం 2027 మార్చి 31 నాటికి వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్–8లో నిలిచే జట్లు నేరుగా వన్డే ప్రపంచకప్ 2027కు అర్హత సాధిస్తాయి. ఆతిథ్య దేశాలైన దక్షిణాఫ్రికా, జింబాబ్వే ఇప్పటికే టోర్నీకి అర్హత పొందాయి. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికా టాప్–8లో కొనసాగితే, తొమ్మిదో స్థానంలో నిలిచే జట్టుకూ ప్రత్యక్ష అర్హత లభించే అవకాశం ఉండటంతో పోటీ మరింత ఆసక్తికరంగా మారింది.

# విశ్వంభరపై భారీ అంచనాలు

## రెండు పార్టులుగా విడుదల అంటూ పుకార్లు

మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం విశ్వంభరపై మరోసారి సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ మొదలైంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నారనే వార్తలు ఇటీవల వైరల్‌గా మారాయి. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో త్రిష కథానాయికగా నటిస్తోంది. చాలా కాలం క్రితమే విడుదల కావాల్సిన ఈ సినిమా, పలు కారణాలతో వరుసగా వాయిదా పడుతూ వస్తోంది. ముఖ్యంగా ప్రస్తుతం టాలీవుడ్‌లో సీక్వెల్స్ ట్రెండ్ బలంగా కొనసాగుతున్న నేపథ్యంలో, 'విశ్వంభర'ను కూడా రెండు భాగాలుగా తీసుకురావాలని మేకర్స్ ఆలోచిస్తున్నారనే ప్రచారం జోరందుకుంది. అయితే ఈ వార్తలపై దర్శకుడు వశిష్ట తాజాగా స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. 'రెండు పార్ట్స్‌గా వస్తున్న విశ్వంభర' అంటూ సోషల్ మీడియాలో వచ్చిన ఓ పోస్టుకు స్పందించిన ఆయన.. 'అవునా.. నిజమా?' అంటూ వెటకారంగా రిప్లై ఇచ్చారు. దీంతో ప్రస్తుతం ఈ సినిమా రెండు భాగాలుగా విడుదలయ్యే ఆలోచన లేదనే విషయం స్పష్టమైంది. ఇక సినిమా షూటింగ్ దాదాపు పూర్తయినప్పటికీ, విడుదల మాత్రం ఇంకా ఆలస్యమవుతోంది. దీనికి ప్రధాన కారణం భారీ స్థాయిలో జరుగుతున్న విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ పనులేనని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా మొత్తం విజువల్ ఫాంటసీ ప్రపంచం నేపథ్యంలో తెరకెక్కుతుండటంతో, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదనే ఉద్దేశంతో మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని సమాచారం. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవి స్వయంగా వీఎఫ్‌ఎక్స్ పనులను పర్యవేక్షిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతి ఇవ్వాలనే లక్ష్యంతో ప్రతి ఫ్రేమ్‌పై జాగ్రత్తలు తీసుకుంటున్నారట. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత కీరవాణి సంగీతం అందిస్తున్నారు. అలాగే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కోసం 'హను-మాన్' ఫేమ్ గౌర హరిని కూడా రంగంలోకి దింపినట్లు సమాచారం. మొత్తానికి 'విశ్వంభర' సాధారణ ఫాంటసీ చిత్రం కాకుండా, తెలుగు ప్రేక్షకులకు భారీ విజువల్ విందుగా నిలవబోతుందనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.






# విజయ్ క్రేజ్ చూసి షాక్ అయ్యాను..

## ప్రియాంక చోప్రా పాత వ్యాఖ్యలు వైరల్!

**చెన్నై:** తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ దళపతి విజయ్ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన తరుణంలో, ఆయన సినీ ప్రస్థానానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన నటి ప్రియాంక చోప్రా సినీ ప్రయాణం విజయ్ సరసన ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తన తొలి సినిమా హీరో గురించి ఆమె గతంలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. 2002లో విడుదలైన 'తమిళన్' సినిమాతో ప్రియాంక చోప్రా సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. అప్పటి తన అనుభవాలను గుర్తు చేసుకుంటూ.. "నాకు అప్పట్లో తమిళం అస్సలు తెలియదు, డైలాగులను కాగితంపై రాసుకుని బట్టీ పట్టేదాన్ని. షూటింగ్ సెట్ అంటే ఎలా ఉంటుందో కూడా తెలియని తరుణంలో విజయ్ నాకు ఎంతో సహకరించారు. అయితే షూటింగ్ సమయంలో ఆయనకున్న అభిమాన గణాన్ని చూసి నేను పూర్తిగా షాక్ అయ్యాను. వందలాది మంది ఫ్యాన్స్ సెట్స్ దగ్గరకు వచ్చి ఆయన్ను చూసే విధానం, ఆరాధించే తీరు చూస్తే.. ప్రజలు ఆయన్ను ఒక దేవుడిలా చూస్తున్నారని నాకు అనిపించింది" అని ప్రియాంక పేర్కొన్నారు. ప్రియాంక చోప్రా తల్లి మధు చోప్రా కూడా గతంలో విజయ్ వ్యక్తిత్వాన్ని ప్రశంసించారు. "విజయ్ తన కూతురిని ఎంతో గౌరవంగా చూసుకునేవారని, స్టార్ హీరో అనే గర్వం లేకుండా కొత్త హీరోయిన్‌కు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చారని" ఆమె తెలిపారు. మొదట్లో విజయ్‌తో సమానంగా డ్యాన్స్ చేయడం ప్రియాంకకు సవాలుగా అనిపించినా, ఆయన సహకారంతోనే అది సాధ్యమైందని చెప్పారు. 'తమిళన్' సినిమా ఇచ్చిన స్ఫూర్తే ప్రియాంకను నటనను ఒక కెరీర్‌గా ఎంచుకునేలా చేసిందని ఆమె వెల్లడించారు. నాడు ఒక సామాన్య నటిగా విజయ్ మేనరిజమ్స్ చూసి ఆశ్చర్యపోయిన ప్రియాంక, నేడు ఆయన ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎదగడంపై సినీ ప్రముఖులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాటి ఆమె మాటలు ఇప్పుడు విజయ్ రాజకీయ ఎదుగుదలకు సరిగ్గా సరిపోతాయని అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు.





# నేను బీజేపీకి సపోర్ట్ చేస్తా.. రేపిస్టులకు కాదు..

## యాంకర్ రష్మీ గౌతమ్ సంచలన పోస్ట్




కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ సాయిపై పోక్సో కేసు వ్యవహారంపై యాంకర్ రష్మీ గౌతమి సంచలన పోస్టు చేశారు. తాను బీజేపీకి మద్దతిస్తానని.. అయితే లైంగిక వేధింపులకు పాల్పడేవారికి కాదని రష్మి స్పష్టం చేశారు. యాంకర్ రష్మీ గురించి స్పెషల్ ఇంట్రడక్షన్ అవసరం లేదు. సోషల్ మీడియాలో ఎప్పుడూ బీజేపీకి అనుకూలంగా పోస్టులు పెడుతుంటారు. ఈ క్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై పోక్సో కేసు విషయంలో పలువురు ఆమెను ట్యాగ్ చేస్తూ పోస్టులు పెడుతున్నారు. ఈ వ్యవహారంపై ఎందుకు స్పందించడం లేదని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. దీనిపై రష్మి ఎక్స్ వేదికగా స్పందించారు. "నేను బీజేపీకి మద్దతు ఇస్తాను కానీ.. రేపిస్టులకు, లైంగిక వేధింపులకు పాల్పడేవారికి కాదని" ఆమె పేర్కొన్నారు. తాను సమస్యలపై కేవలం సానుభూతి చూపగలనని, పోరాడేంత శక్తి తనకు లేదన్నారు.

# ప్రేమ ఎప్పటికీ శక్తివంతమైనదే

## నటి త్రిష ఆసక్తికర పోస్ట్

ఫిల్మ్ స్టార్ త్రిష తన సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. ప్రేమ ఎప్పటికీ శక్తివంతమైందే అని ఆమె తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. త్రిష తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలు పెట్టారు. నీలిరంగు చీరలో త్రిష ఆకట్టుకున్నది. తమిళనాడు సీఎంగా ఆదివారం విజయ్ ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆ ఈవెంట్‌కు ఈసారీలోనే ఆమె హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన త్రిష సోమవారం తన సోషల్ మీడియా పోస్టుతో తన భావోద్వేగాన్ని మరింత స్పష్టంగా వ్యక్తం చేశారు. చెన్నై నెహ్రూ స్టేడియంలో సందడి చేసిన నటి త్రిష.. తన పోస్టులో ప్రేమ గొప్పతనాన్ని వ్యక్తం చేశారు. రకరకాల స్టిల్స్‌తో దిగిన ఫోటోలను పోస్టు చేసిన త్రిష.. ప్రేమ ఎప్పటికీ గట్టిగానే వ్యక్తం అవుతుందన్న అభిప్రాయాన్ని ఆ పోస్టులో రాశారు. ద లవ్ ఈజ్ ఆల్వేస్ లౌడర్ అన్న క్యాప్షన్ ఇప్పుడు ట్రెండ్ అవుతోంది. ఆ పోస్టులో తన స్టయిలిస్ట్ బృందానికి ఆమె థ్యాంక్స్ కూడా చెప్పింది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# గోదావరిలో 3 వేల టీఎంసీల నీరు వృథా


- గోదావరి జలాల వినియోగంపై మంత్రి నిమ్మల వ్యాఖ్యలు
- 2027 నాటికి పోలవరం పూర్తి చేస్తామని స్పష్టం
- గోదావరి-కావేరి అనుసంధానంపై కేంద్రంతో చర్చలు



**అమరావతి, మే 11:** గోదావరి నదిలో ప్రతి సంవత్సరం సుమారు 3 వేల టీఎంసీల వరద నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గోదావరి మిగులు జలాలను వినియోగించుకోవడంలో తెలుగు రాష్ట్రాలకు ఎలాంటి ఇబ్బందులు లేవని, పరస్పర చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి సోమవారం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తో సమావేశమై పలు నీటిపారుదల ప్రాజెక్టులపై చర్చించారు. ఈ సమావేశం అనంతరం మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ చర్చల వివరాలను వెల్లడించారు. తెలుగు రాష్ట్రాలు రెండూ అభివృద్ధి చెందాలని చంద్రబాబు మొదటి నుంచి కోరుకుంటున్నారని పేర్కొన్నారు. దేశంలోనే అత్యంత కీలక ప్రాజెక్టులలో ఒకటైన పోలవరం ప్రాజెక్టును 2027 జూన్ నాటికి పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కలిసి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను కరువు రహిత రాష్ట్రంగా మార్చే సామర్థ్యం పోలవరం ప్రాజెక్టుకు ఉందని పేర్కొన్నారు. పీపీఏ, సీడబ్ల్యూసీ నిర్దేశించిన గడువుల ప్రకారమే పనులు పూర్తి చేస్తామని నిమ్మల తెలిపారు. గత వైసీపీ పాలనలో పోలవరం ప్రాజెక్టు పురోగతి ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపించారు. ప్రస్తుతం పనులను వేగవంతం చేసి ప్రాజెక్టును పూర్తి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. గోదావరి--కావేరి నదుల అనుసంధాన అంశంపై కూడా కేంద్ర మంత్రితో చర్చించినట్లు వెల్లడించారు. పోలవరం సివిల్ పనులు, పునరావాసం, పునరుద్ధరణ అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. తొలి దశలో 41.15 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన నిర్మాణాలను పూర్తి చేయడానికి కేంద్ర సహకారం కోరినట్లు వివరించారు. రాష్ట్ర భవిష్యత్ నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవడం అత్యవసరమని మంత్రి అభిప్రాయపడ్డారు. సాగునీరు, తాగునీరు, పరిశ్రమల అవసరాలకు దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు.

# ఏపీకి బలమైన మూడో ప్రత్యామ్నాయం అవసరం

- వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో నిండిన అన్ని కంపార్ట్‌మెంట్లు
- సర్వదర్శనానికి 18 గంటల సమయం
- ఒక్కరోజే రూ.3.23 కోట్ల హుండీ ఆదాయం



**అమరావతి, మే 11 :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్రానికి ఇప్పుడు ఒక బలమైన మూడో ప్రత్యామ్నాయం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు చేసిన ట్వీట్‌లో ప్రస్తుతం ఏపీ రాజకీయాలు రెండు విభిన్న ధోరణుల మధ్య చిక్కుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ, వైసీపీ విధానాలపై విజయసాయి రెడ్డి విమర్శలు గుప్పించారు. "ఒకవైపు గ్రామీణ ప్రాంతాలను విస్మరించే టీడీపీ పట్టణ కేంద్రీకృత దృక్పథం, మరోవైపు అభివృద్ధిపై స్పష్టమైన దార్శనికత లేకుండా కేవలం సంక్షేమంపైనే ఆధారపడుతున్న వైసీపీ విధానం రాష్ట్రాన్ని ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి" అని పేర్కొన్నారు. ఈ రెండు తీవ్ర ధోరణుల మధ్య రాష్ట్ర రాజకీయాలు నలిగిపోతున్నాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి అవసరమైన నాయకత్వంపై కూడా విజయసాయి రెడ్డి తన అభిప్రాయాన్ని వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేసే విశ్వసనీయమైన రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని అన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు వాటి ప్రయోజనాలు రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికి చేరేలా చూసే నాయకత్వం రావాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ అభివృద్ధికి సమతుల్య ఆర్థిక విధానాలు అవసరమని ఆయన పేర్కొన్నారు. కేవలం పట్టణాల అభివృద్ధి గానీ, కేవలం సంక్షేమ పథకాలపైనే ఆధారపడే విధానం గానీ సరిపోదని అభిప్రాయపడ్డారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య సమాన అభివృద్ధి జరిగేలా ప్రణాళికలు అవసరమని తెలిపారు. ఇటీవలే తాను కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేసే అవకాశంపై విజయసాయి రెడ్డి సంకేతాలు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన తాజా వ్యాఖ్యలకు మరింత రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. ఆయన భవిష్యత్ రాజకీయ అడుగులపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ కొనసాగుతోంది. విజయసాయి రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు ఏపీ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసే అవకాశముందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మూడో ప్రత్యామ్నాయం అంశాన్ని ఆయన ప్రస్తావించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

# జేసీబీని ఢీకొన్న కారు

## ఒక్కసారిగా చెలరేగిన మంటలు.. కారు దగ్ధం

## రాజుపాలెం సమీపంలో ఘోర ప్రమాదం

**మార్కాపురం, మే 11:** ప్రకాశం జిల్లా మార్కాపురం సమీపంలోని రాజుపాలెం వద్ద సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. విజయవాడ నుండి శ్రీశైలం వెళ్తున్న ఒక కారు, ముందు వెళ్తున్న జేసీబీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగి, చూస్తుండగానే వాహనం పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. అయితే, ఈ ప్రమాదంలో ఒక పెను ప్రమాదం తప్పిందనే చెప్పాలి. కారులో మంటలు వ్యాపించడానికి ముందే అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు అప్రమత్తమై బయటకు దూకేయడంతో ప్రాణాపాయం తప్పింది. కారులోని ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయని, ప్రస్తుతం వారు సురక్షితంగా ఉన్నారని సమాచారం. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరిస్థితి భీభత్సంగా ఉండేదని, అదృష్టవశాత్తూ అందరూ ప్రాణాలతో బయటపడ్డారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.



# 'ఫ్లోరెన్స్ నైటింగేల్' అవార్డులకు ఐదుగురి ఎంపిక

## గుంటూరులో ప్రదానం చేయనున్న మంత్రి



**అమరావతి, మే 11 :** 2025 సంవత్సరానికి గాను నర్సింగ్ రంగంలో ఉత్తమ సేవలందిస్తున్న ఐదుగురికి 'ఫ్లోరెన్స్ నైటింగేల్' అవార్డుల్ని ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రకటించింది. 'ఇంటర్నేషనల్ నర్సెస్ డే' సందర్భంగా ఈ ఐదుగురికి గుంటూరులో మంగళవారంనాడు వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రదానం చేయనున్నారు. పరిశోధన, బోధన, రోగుల సేవ, ఇతర కేటగిరీల పనితీరులో వీరు ఉత్తమ పనితీరు కనబరిచారని అధికారులు తెలిపారు.

### అవార్డు గ్రహీతలు వీరే

డాక్టర్ బి.వనజ కుమారి (ప్రిన్సిపాల్, నారాయణ నర్సింగ్ కాలేజీ, నెల్లూరు)కి బెస్ట్ నర్స్ రీసెర్చర్, డాక్టర్ సి.ఆర్.సంషేర్ బేగం (ప్రిన్సిపాల్, మిమ్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, విజయనగరం)కు బెస్ట్ నర్స్ అడ్మినిస్ట్రేటర్, డాక్టర్ కె.సుగంతి(లెక్చరర్, గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, మచిలీపట్నం)కు బెస్ట్ నర్స్ ఎడ్యుకేటర్, ఎస్. చిన్నమ్మి(హెడ్ నర్స్, సిహెచ్‌సి, బుడితి, శ్రీకాకుళం జిల్లా)కు బెస్ట్ నర్సింగ్ సర్వీసెస్, కె.సావిత్రి(ఎన్ఎన్ఎం, పిహెచ్‌సి, చుక్కలూరు, అనంతపురం జిల్లా)కు క్యాటగిరీ ఆఫ్ బెస్ట్ ఎఎన్ఎం అవార్డుల్ని ప్రదానం చేస్తారు.

# కైలాసగిరిపై త్రిశూల్ ఏర్పాటు శుభపరిణామం

- స్వాభిమాన్ పర్వ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు మాధవ్



**విశాఖపట్నం, మే 11:** విశాఖలోని కైలాసగిరిపై త్రిశూలాన్ని ఏర్పాటు చేయడం ఒక శుభ పరిణామమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ అన్నారు. నగరంలోని కైలాసగిరి వేదికగా జరిగిన 'స్వాభిమాన్ పర్వ' కార్యక్రమం ఆధ్యాత్మికత, జాతీయ భద్రత అంశాల కలయికగా సాగింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు మాధవ్, ఇతర ముఖ్య నేతలు పాల్గొని, దేశం ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిణామాలు, సాంస్కృతిక పునరుజ్జీవనంపై అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పి.వి.ఎన్ మాధవ్ మాట్లాడుతూ.. 'సింహాచలం క్షేత్రంలో భాగమైన కైలాసగిరిని ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దే క్రమంలో చేపట్టిన త్రిశూల్ ప్రాజెక్ట్ అభినందనీయం. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ స్వాభిమాన్ జాగరణ కేవలం ఆధ్యాత్మికతకే పరిమితం కాకుండా, దేశ రక్షణ అంశాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్తోంది. గత పన్నెండేళ్ల కాలంలో పఠాన్‌కోట్ మినహా దేశంలో పెద్దగా ఉగ్రవాద ఘటనలు చోటుచేసుకోకపోవడం.. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాయకత్వంలో అంతర్గత భద్రత ఎంత పటిష్టంగా ఉందో నిరూపిస్తోంది. ముఖ్యంగా 'ఆపరేషన్ కగార్' ద్వారా దేశవ్యాప్తంగా తీవ్రవాద ఏరివేత ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. ఎన్డీయే హయాంలో దేశ సరిహద్దులు మరింత సురక్షితంగా మారాయని అన్నారు.



# నన్ను పార్టీ నుంచి ఎవరూ దూరం చేయలేరు

## పుకార్లపై ఘాటుగా స్పందించిన శ్యామల

## పదవుల కోసం రాజకీయాల్లోకి రాలేదని వ్యాఖ్య

## జగనన్నపై నమ్మకమే తన బలమని స్పష్టం

**అమరావతి, మే 11:** ప్రముఖ యాంకర్, వైసీపీ నాయకురాలు శ్యామల తనపై వస్తున్న ప్రచారాలపై ఘాటుగా స్పందించారు. తనను పార్టీ నుంచి దూరం చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారనే ప్రచారాలను ఖండించారు. "నాకు కౌంట్‌డౌన్ మొదలైంది" అంటూ జరుగుతున్న చర్చలపై స్పందిస్తూ, అలాంటి ప్రయత్నాలు ఎవరి వల్లా సాధ్యం కాదని స్పష్టం చేశారు. తాను రాజకీయాల్లోకి పదవుల కోసం రాలేదని శ్యామల పేర్కొన్నారు. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకోవడమే తన లక్ష్యమని చెప్పారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశీస్సులతోనే రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. ప్రజల ప్రేమ, జగన్‌పై ఉన్న నమ్మకం ఉన్నంతకాలం తనను ఎవరూ ఆపలేరని అన్నారు. తన రాజకీయ ప్రయాణం ఎవరి కరుణతో ప్రారంభం కాలేదని శ్యామల స్పష్టం చేశారు. తన స్వరం, నిబద్ధత, జగన్‌కు అండగా నిలబడే ధైర్యమే తన బలమని పేర్కొన్నారు. జగన్ తనపై ఉంచిన నమ్మకం తాను ముందుకు సాగడానికి ప్రేరణగా నిలుస్తోందని తెలిపారు. తాడేపల్లిలో "పొగ" కనిపిస్తోందంటూ కథనాలు రాసేవారిపై కూడా శ్యామల విమర్శలు చేశారు. "పొగ ఎక్కువగా కనిపిస్తే కొందరిలో కడుపుమంట ఎక్కువగా ఉందని అర్థం" అని వ్యాఖ్యానించారు. పుకార్లు, కుట్రల ద్వారా తనను పార్టీ నుంచి దూరం చేయలేరని స్పష్టం చేశారు. తనపై ప్రతిరోజూ అవాకులు చెవాకులు రాసేవారు ఉంటారని, కానీ తాను మాత్రం జగన్ కలలు గన్న ఆంధ్రప్రదేశ్ కోసం పని చేస్తూనే ఉంటానని చెప్పారు. తన గళాన్ని సైలెంట్ చేయాలని ప్రయత్నిస్తే అది మరింత గట్టిగా వినిపిస్తుందని హెచ్చరించారు. ఇది తన కౌంట్‌డౌన్ కాదని, తన పోరాటానికి మరింత బలం చేకూరుతున్న సమయమని శ్యామల పేర్కొన్నారు. తనను తగ్గించాలనుకునే వారు చాలామంది ఉన్నప్పటికీ, తనను నిలబెట్టేది జగన్‌పై ఉన్న నమ్మకం, ప్రజల ప్రేమ మాత్రమేనని స్పష్టం చేశారు.

# చురుకుగా మహానాడు ఏర్పాట్లు

## నేతలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నారాయణ



**నెల్లూరు, మే 11:** ఈ నెలాఖరులో ప్రారంభమయ్యే పార్టీ మహానాడుకు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమం జరగనున్న కిసాన్ సేజ్ ప్రాంతాన్ని పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పరిశీలించారు. సభాప్రాంగణం, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష చేశారు. మూడు రోజుల పాటు జరిగే మహానాడులో కీలక తీర్మానాలు చేస్తారని మంత్రి నారాయణ తెలిపారు. 'మహానాడు సుపరిపాలనకు దోహదపడే విధంగా నిర్వహించాలి. తొలి రెండు రోజులు పార్టీ డెలిగేట్స్‌తో, మూడో రోజు బహిరంగ సభగా జరగనుంది. బహిరంగ సభకు 7 లక్షల మందికి పైగా ప్రజలు రాబోతారని అంచనా. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. కమిటీల ప్రతినిధుల సమావేశంలో బాధ్యతలపై దిశా నిర్దేశర చేస్తాం. మహానాడును చరిత్రలో నిలిచేలా నిర్వహిస్తాం' అని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ..'సభా ప్రాంగణం, పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించాం. మహానాడుకు సుమారు 6 వేల బస్సులు రావచ్చని అంచనా. పోలీసులు భద్రతా ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. తెలుగు ప్రజల పండగ అయిన మహానాడును నిర్వహించే తొలి అవకాశం నెల్లూరు జిల్లాకు దక్కింది' అన్నారు.

# అనధికార లౌడ్‌స్పీకర్లపై డీజీపీకి రఘురామ లేఖ

**అమరావతి, మే11:** ప్రార్థనా స్థలాల్లో అనధికార లౌడ్‌స్పీకర్లపై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకి రఘురామ సోమవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. శబ్దకాలుష్య నియంత్రణ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రార్థనా స్థలాల్లో అధిక శబ్దంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లౌడ్‌స్పీకర్లతో విద్యార్థులు, వృద్ధులు, రోగులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని రఘురామ వ్యాఖ్యానించారు. ఏడాదిలో గరిష్ఠంగా 15 రోజులు మాత్రమే లౌడ్‌స్పీకర్లకు అనుమతి ఉందని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై బీఎన్ఎస్ సెక్షన్ల కింద చర్యలు తీసుకోవాలని సూచించారు. పబ్లిక్ న్యూసెన్స్ సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనధికార సౌండ్ సిస్టమ్‌లను స్వాధీనం చేసుకునే అధికారం పోలీసులకు ఉందని స్పష్టం చేశారు. నివాస ప్రాంతాల్లో శాంతిభద్రతలు కాపాడాలని డీజీపీకి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధంగా నిబంధనలు అమలు చేయాలని రఘురామ కోరారు.

# నిత్యావసరాల ధరలు మళ్లీ పెరిగే సూచనలు



**న్యూఢిల్లీ, మే 11 :** దేశంలో ఇప్పటికే పెరుగుతున్న ధరలతో ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలకు మరో షాక్ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. సబ్బులు, డిటర్జెంట్లు, బిస్కెట్లు, ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలు వంటి నిత్యావసర వస్తువుల ధరలను మరోసారి పెంచేందుకు ఎఫ్ఎంసీజీ సంస్థలు సిద్ధమవుతున్నాయి. ఇంధన వ్యయాలు, ప్యాకేజింగ్ ఖర్చులు, ముడి చమురు ధరలు పెరగడం, అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తయారీ సంస్థలు పేర్కొంటున్నాయి. ఈ కారణాల వల్ల ధరల పెంపు తప్పడం లేదని అవి వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే పలు సంస్థలు తమ ఉత్పత్తుల ధరలను మూడు నుంచి ఐదు శాతం వరకు పెంచాయి. చిన్న ధరల ప్యాకెట్లను అలాగే ఉంచి, మిగతా ఉత్పత్తుల ధరలను పెంచడం లేదా పరిమాణాన్ని తగ్గించడం వంటి చర్యలను పరిశీలిస్తున్నాయి. డాబర్ ఇండియా ఇప్పటికే తమ ఉత్పత్తుల ధరలను నాలుగు శాతం పెంచినట్లు తెలిపింది. బ్రిటానియా సంస్థ కూడా త్వరలో కొన్ని ఉత్పత్తుల ధరలను పెంచనున్నట్లు సంకేతాలు ఇచ్చింది. హిందూస్థాన్ యూనిలివర్ లిమిటెడ్ కూడా ముడి సరుకుల ధరలు పెరుగుతుండటంతో సబ్బులు, డిటర్జెంట్ల ధరలను పెంచాల్సి వచ్చే అవకాశముందని పేర్కొంది. ఫెవికాల్ తయారీ సంస్థ పిడిలైట్ ఇండస్ట్రీస్ కూడా ధరల పెంపు దిశగా అడుగులు వేస్తోంది. కొబ్బరి నూనె, వంట నూనెలను విక్రయించే మారికో సంస్థ ఇప్పటికే తమ ఉత్పత్తుల ధరలను ఆరు నుంచి ఏడు శాతం వరకు పెంచింది. ఇదే సమయంలో కమర్షియల్ ఎల్పీజీ ధరలు పెరగడం కూడా వ్యాపార రంగంపై అదనపు భారం మోపుతోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతుండటంతో త్వరలో దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. ఇంధన ధరలు పెరిగితే రవాణా వ్యయాలు మరింత పెరిగి, దాని ప్రభావం నిత్యావసర వస్తువుల ధరలపై కూడా పడే అవకాశముందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం మరింత పెరిగే పరిస్థితి కనిపిస్తోంది.



## పసిడి ధరల్లో స్వల్ప తగ్గుదల

**హైదరాబాద్, మే 11 :** అంతర్జాతీయ స్థాయిలో నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. ఇరాన్ యుద్ధ విరమణ ప్రతిపాదనలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తిరస్కరించిన నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. గుడ్ రిటర్న్స్ వివరాల ప్రకారం, సోమవారం ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,130కు చేరింది. గత ముగింపుతో పోలిస్తే రూ.220 తగ్గింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.200 మేర తగ్గి రూ.1,39,450 వద్ద కొనసాగుతోంది. వెండి ధరలు మాత్రం పెరుగుదల దిశగా సాగుతున్నాయి. నగరంలో కిలో వెండి ధర రూ.5 వేల మేర పెరిగి ప్రస్తుతం రూ.2.85 లక్షల వద్ద ట్రేడవుతోంది. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,53,820గా ఉండగా, ఢిల్లీలో రూ.1,52,280గా నమోదైంది. ముంబైలో అదే ధర రూ.1,52,130 వద్ద కొనసాగుతోంది. అలాగే 22 క్యారెట్ల బంగారం ధర చెన్నైలో రూ.1,41,000గా ఉండగా, ముంబైలో రూ.1,39,450గా నమోదైంది. ఢిల్లీలో ఈ ధర రూ.1,39,600 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. ఔన్స్ బంగారం ధర సుమారు ఒక శాతం మేర పడిపోయి 4,670 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మరోవైపు వెండి ధరలు పెరిగి ఔన్స్‌కు 81 డాలర్ల వద్ద కొనసాగుతున్నాయి.



## రూ. కోటి విలువైన డుకాటీ స్పెషల్ బైక్

**ముంబై, మే 11 :** ఇటాలియన్ ప్రీమియం మోటార్‌సైకిల్ తయారీ సంస్థ అత్యంత ప్రత్యేకమైన పరిమిత ఎడిషన్ సూపర్ బైక్ 'పనిగేల్ వీ4 లంబోర్గిని'ను భారత మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఈ బైక్ ఎక్స్‌షోరూమ్ ధర రూ.1 కోటిగా నిర్ణయించారు. ఈ లిమిటెడ్ ఎడిషన్ బైక్‌కు సంబంధించిన బుకింగ్స్ ఇప్పటికే పూర్తయ్యాయని సంస్థ వెల్లడించింది. మొదటి బైక్‌ను ముంబైలో కస్టమర్‌కు డెలివరీ చేసినట్లు తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఈ ప్రత్యేక ఎడిషన్‌లో కేవలం 630 యూనిట్లను మాత్రమే తయారు చేస్తున్నట్లు డుకాటీ పేర్కొంది. దీంతో భారత్‌కు వచ్చిన అత్యంత అరుదైన సూపర్ బైక్‌లలో ఇది ఒకటిగా నిలిచింది. ఇంకా ప్రత్యేకంగా 'స్పెషాలీ క్లయింటి' పేరుతో మరో ఎడిషన్‌ను కూడా సంస్థ రూపొందిస్తోంది. ఇందులో ప్రపంచవ్యాప్తంగా కేవలం 63 యూనిట్లను మాత్రమే ఉత్పత్తి చేయనున్నారు. ఈ ఎడిషన్‌ను ప్రత్యేకంగా లంబోర్గిని కార్ల యజమానుల కోసం తయారు చేస్తున్నారు. తమ కార్ల రంగులకు అనుగుణంగా బైక్‌ను అనుకూలీకరించుకునే అవకాశం కూడా కల్పిస్తున్నారు. డుకాటీ పనిగేల్ వీ4 ఎస్ ఆధారంగా రూపొందించిన ఈ బైక్‌కు లంబోర్గిని రెవుయెల్టో సూపర్‌కార్ నుంచి ప్రేరణ తీసుకున్నట్లు సంస్థ తెలిపింది. డుకాటీ, లంబోర్గిని కలిసి రూపొందించిన మూడో ప్రత్యేక మోడల్ ఇదే కావడం విశేషం. బైక్ రూపకల్పనలో కార్బన్ ఫైబర్‌ను విస్తృతంగా ఉపయోగించారు. ఫెయిరింగ్, మడ్ గార్డులు, హీల్ గార్డులు, ట్యాంక్ ప్రొటెక్షన్, ఎగ్జాస్ట్ కవర్, రేడియేటర్ డక్ట్ వంటి భాగాలను కార్బన్ ఫైబర్‌తో తయారు చేయడం వల్ల బరువు గణనీయంగా తగ్గినట్లు కంపెనీ వెల్లడించింది. ఈ బైక్‌లో 1,103 సీసీ డెస్మోసెడిసి స్ట్రాడేల్ వీ4 ఇంజిన్‌ను అమర్చారు. దీనికి 6 స్పీడ్ గేర్‌బాక్స్‌తో పాటు స్లిప్పర్ డ్రై క్లచ్‌ను అందించారు. మొత్తం బరువు 185 కిలోలుగా ఉండే ఈ బైక్, పనిగేల్ సిరీస్‌లో అత్యంత తేలికైన మరియు అత్యంత శక్తివంతమైన మోడల్‌గా నిలుస్తుందని సంస్థ పేర్కొంది.



## గల్ఫ్ ఉద్రిక్తతలతో మార్కెట్ ఆందోళన




**ముంబై, మే 11 :** దేశీయ స్టాక్ మార్కెట్లపై ఈ వారం కూడా గల్ఫ్ దేశాల పరిణామాల ప్రభావం ప్రధానంగా కనిపించే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు మదుపర్లలో ఆందోళన పెంచుతున్నాయి. గత వారం తీవ్ర ఒడిదుడుకుల మధ్య సెన్సెక్స్ 414 పాయింట్లకు పైగా పెరిగి 77,328 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 178 పాయింట్లు లాభపడి 24,176 స్థాయిలో స్థిరపడింది. అయితే అంతర్జాతీయ పరిస్థితులు ఇంకా అనిశ్చితంగానే ఉండటంతో ఈ వారం మార్కెట్లలో హెచ్చుతగ్గులు కొనసాగవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గి శాంతి చర్చలు ముందుకు సాగితే మార్కెట్లు మరింత పుంజుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైఖరిలో స్పష్టత లేకపోవడం, ఇరాన్ కూడా గట్టిగా స్పందించడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తున్నాయి. ఇరువైపులా సైనిక చర్యలకు సిద్ధమవుతున్నారనే వార్తలతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. దీనివల్ల దేశీయ మార్కెట్లపై అమ్మకాల ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక జనవరి-మార్చి త్రైమాసికానికి సంబంధించిన ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఆర్థిక ఫలితాలు కూడా ఈ వారం ట్రేడింగ్‌ను ప్రభావితం చేయనున్నాయి. గ్లోబల్ మార్కెట్ల ధోరణి, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ, విదేశీ మదుపర్ల పెట్టుబడుల కదలికలు కూడా కీలకంగా మారనున్నాయి. అమ్మకాల ఒత్తిడి పెరిగితే నిఫ్టీకి 23,800 స్థాయి ముఖ్య మద్దతుగా ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆ స్థాయి కంటే దిగువకు పడిపోతే 23,500 వరకు దిగజారే అవకాశముందని చెబుతున్నారు. మరోవైపు కొనుగోళ్లు పెరిగితే నిఫ్టీ 24,400 నుంచి 24,700 పాయింట్ల వరకు వెళ్లే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు. స్టాక్ మార్కెట్ పెట్టుబడులు ఎప్పుడూ రిస్క్‌తో కూడుకున్నవేనని, అంతర్జాతీయ పరిణామాలు మార్కెట్లపై ప్రభావం చూపుతుంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

## తక్కువ ధరకే బీఎస్ఎన్ఎల్ డేటా

**న్యూఢిల్లీ, మే 11 :** ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ వినియోగదారులను ఆకట్టుకునేందుకు రూ.225 ధరలో కొత్త ప్రీపెయిడ్ ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. తక్కువ ఖర్చుతో ఎక్కువ డేటా, పూర్తి నెల వ్యాలిడిటీ కోరుకునే కస్టమర్లను దృష్టిలో పెట్టుకుని ఈ ప్లాన్‌ను రూపొందించినట్లు సంస్థ తెలిపింది. ఈ ప్లాన్‌లో భాగంగా వినియోగదారులకు రోజుకు 2.5 జీబీ హైస్పీడ్ డేటా లభిస్తుంది. మొత్తం 30 రోజుల వ్యాలిడిటీతో సుమారు 75 జీబీ డేటాను వినియోగించుకునే అవకాశం ఉంటుంది. రోజువారీ డేటా పరిమితి పూర్తైన తర్వాత కూడా ఇంటర్నెట్ సేవలు కొనసాగుతాయని, అయితే వేగం తగ్గుతుందని సంస్థ పేర్కొంది. డేటాతో పాటు అన్ని నెట్‌వర్క్‌లకు అపరిమిత వాయిస్ కాల్స్ సౌకర్యాన్ని కూడా ఈ ప్లాన్‌లో కల్పించారు. అదనంగా రోజుకు 100 ఎస్ఎంఎస్‌ల ప్రయోజనం కూడా లభిస్తుంది. ఈ ప్లాన్‌లో ప్రధాన ఆకర్షణ 30 రోజుల పూర్తి వ్యాలిడిటీ. ప్రస్తుతం అనేక ప్రైవేట్ టెలికాం సంస్థలు 28 రోజుల ప్లాన్‌లను అందిస్తుండగా, బీఎస్ఎన్ఎల్ మాత్రం పూర్తి నెల కాలపరిమితిని ఇస్తోంది. తక్కువ ధరకే ఎక్కువ డేటా అవసరమయ్యే వినియోగదారులకు ఈ ప్లాన్ మంచి ఎంపికగా నిలుస్తుందని టెలికాం వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




## ఏఐ ఉద్యోగుల భారీ సంపద

**న్యూఢిల్లీ, మే 11 :** కృత్రిమ మేధ రంగంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు ఒక్కసారిగా కోట్లాది డాలర్ల సంపదను సొంతం చేసుకున్న ఘటన ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రముఖ కృత్రిమ మేధ సంస్థ కు చెందిన పలువురు ప్రస్తుత, మాజీ ఉద్యోగులు సెకండరీ మార్కెట్‌లో భారీ స్థాయిలో షేర్ల విక్రయం చేపట్టి మిలియనీర్లుగా మారినట్టు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. సమాచారం ప్రకారం గత ఏడాది అక్టోబర్‌లో సంస్థ అనుమతితో సుమారు 6.6 బిలియన్ డాలర్ల విలువైన షేర్లను ఉద్యోగులు విక్రయించారు. ఈ లావాదేవీల ఆధారంగా సంస్థ మార్కెట్ విలువ సుమారు 400 బిలియన్ డాలర్లుగా నమోదైనట్టు తెలుస్తోంది. సిలికాన్ వ్యాలీ చరిత్రలో సంస్థ స్టాక్ మార్కెట్‌లోకి రాకముందే ఉద్యోగులు వ్యక్తిగతంగా ఇంత భారీ సంపదను సంపాదించడం అత్యంత అరుదైన పరిణామమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా 30 మిలియన్ డాలర్ల విలువైన షేర్లను విక్రయించేందుకు అనుమతి లభించింది. దాదాపు 75 మంది ఉద్యోగులు ఈ గరిష్ఠ పరిమితి వరకు తమ వాటాలను విక్రయించి భారీ లాభాలు పొందినట్టు సమాచారం. ఈ లావాదేవీల ద్వారా వచ్చిన మొత్తంలో కొంత భాగాన్ని పన్ను రాయితీలు లభించే లాభాపేక్ష రహిత నిధుల్లో పెట్టుబడిగా పెట్టినట్టు కూడా వెల్లడైంది. ఓపెన్ ఏఐ ప్రారంభ దశలో సంస్థలో చేరిన ఉద్యోగులకే ఈ ప్రయోజనం ఎక్కువగా దక్కినట్టు తెలుస్తోంది. సంస్థ దాదాపు ఏడేళ్ల క్రితం ఉద్యోగులకు ఈక్విటీ షేర్లను కేటాయించడం ప్రారంభించగా, అప్పట్లో లభించిన వాటాల విలువ ప్రస్తుతం వంద రెట్లకుపైగా పెరిగినట్టు సమాచారం. ఇక కృత్రిమ మేధ రంగంలో నిపుణుల కోసం ప్రపంచ టెక్ సంస్థల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులను ఆకర్షించేందుకు కొన్ని కీలక ఉద్యోగాలకు సంవత్సరానికి ఐదు లక్షల డాలర్ల వరకు వేతనాలు చెల్లించేందుకు కూడా సంస్థలు సిద్ధమవుతున్నాయని అంతర్జాతీయ మీడియా పేర్కొంది.

